
సీపీఎం నాయకుడిని బలవంతంగా ఎత్తుకెళ్తున్న పోలీసులు

- సమస్యలు పరిష్కరించకుండా అణచివేత
- ఉపాధ్యాయులు ధర్నాకు వెళ్లకుండా కట్టడి
- సంఘాల నేతలకు ముందస్తు నోటీసులు
- అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం
- సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజ్‌లు
- మునిసిపల్ కార్మికులపైనా ఒత్తిడి
- భగ్గుమంటున్న ఆయా వర్గాలు
- ఆందోళనలు ఉధృతం
- గతంలో ఇచ్చిన హామీల అమలుతోనే సమ్మెలు ఆగుతాయని స్పష్టీకరణ

సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నరేళ్లుగా ఎదురుచూసి విసిగిపోయిన విభిన్న రంగాల ఉద్యోగులు పెద్దఎత్తున రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. అలాంటి వారిని సంతృప్తిపరిచి ఆయా విభాగాల్లో సమ్మెలు ఆపి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడటం పాలకుల విధి. అయితే అందరిదీ ఒక దారి.. మాది మరొక దారి అన్నట్లు వ్యవహరిస్తున్న జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం చిరుద్యోగుల ఆందోళనలపైనా ఉక్కుపాదం మోపుతోంది. కనికరించు జగనన్నా.. అని వేడుకుంటున్న వారిపై కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. అంగన్‌వాడీలపై ఏకంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన ప్రభుత్వం, సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఉపాధ్యాయులను కట్టడి చేస్తోంది. ఆందోళన కార్యక్రమాలకు వెళ్లకుండా పోలీసుల ద్వారా నోటీసులు ఇచ్చి నిర్బంధిస్తోంది. చివరకు పారిశుధ్య కార్మికులపైనా తీవ్ర ఒత్తిడి తెస్తోంది.

నిర్బంధం


ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

చిరుద్యోగులపై ప్రభుత్వ ప్రతాపం


ఒంగోలులో నామాలు పెట్టుకొని మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఒంగోలు,జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిరుద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. వారి ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతోంది. చివరకు ఎస్మాను ప్రయోగించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో నాడు వైసీపీ అధినేత, ప్రస్తుత సీఎం జగన్ విభిన్న వర్గాల ఉద్యోగులు, వివిధ రంగాల వారికి అనేక హామీలు ఇచ్చారు. అటు పాదయాత్ర, ఇటు ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే వాటిని జగన్ ప్రచారం చేయగా వైసీపీ నేతలంతా క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లారు. హామీలను నమ్మి వివిధ వర్గాల ఉద్యోగులు ఆ ఎన్నికల్లో పెద్దఎత్తున వైసీపీకి మద్దతు పలికారు. అలాంటి వారిలో అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఇతర రంగాల వారు ఉన్నారు. అయితే ప్రభుత్వంలోకి వచ్చాక వారికి ఇచ్చిన హామీలు అమలుచేయకపోగా సాధారణంగా పరిష్కరించాల్సిన సమస్యలు, జీతభత్యాలు, ఇతర సర్వీసు విషయాలపై ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు తొలుత ఈ పరిస్థితిపై ఏడాదిన్నర క్రితం తిరుగుబాటు ప్రకటించారు. పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అయితే నయానోభయానో ఉద్యోగసంఘాల నేతలను బెదిరించి లొంగదీసుకుని కొద్దిపాటి ఉపశమన చర్యలతో వాటిని అణచివేసిన ప్రభుత్వం.. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర చిరుద్యోగులను అసలు పట్టించుకోలేదు.

కన్నెర్రచేస్తున్న ప్రభుత్వం

సమ్మె చేస్తున్న వారి సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొని విధులకు హాజరయ్యేలా చూడాల్సిన ప్రభుత్వం అందుకుభిన్నంగా వారిపై నిర్బంధం పెంచుతోంది. అంగన్‌వాడీలపై ఏకంగా ఎస్మాను ప్రయోగించి విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సమగ్ర శిక్ష ఉద్యోగులను విధులకు హాజరుకావడం లేదని షోకాజ్ నోటీసులు ఇప్పిస్తోంది. మునిసిపల్ కార్మికులను కూడా స్థానిక అధికారులు, వైసీపీ నేతల ద్వారా బెదిరింపులకు గురిచేస్తోంది. ఇక ఉపాధ్యాయులు యూటీ ఎఫ్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో విజయవాడలో నిరసనలకు సిద్ధం కాగా అక్కడికి వారిని వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా యూటీఎఫ్ జిల్లా, మండల స్థాయి నేతల ఇళ్లకు పోలీసులు సోమవారం రాత్రి నుంచి వెళ్లి ముందస్తు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నారు. ఈ పరిస్థితిపై ఆయా వర్గాల ఉద్యోగులు మండిపడుతున్నారు. అందులోభాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కూడా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరీ కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ నిర్బంధాలను లెక్కచేయకుండా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వారికి మద్దతుగా కార్మిక సంఘాలు సైతం ఆందోళనలు చేపడుతున్నాయి

విసిగివేసారి ఉద్యమ బాట

నాలుగున్నరేళ్లుగా వినతులు, విజ్ఞప్తులతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వద్దకు తిరిగి, తిరిగి వేసారిన ఆయా రంగాల చిన్నస్థాయి ఉద్యోగులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మునిసిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో ఆందోళన బాటపట్టారు. అంగన్‌వాడీలు 28 రోజుల నుంచి, మునిసిపల్ కార్మికులు 13రోజులుగా సమ్మె చేస్తున్నారు. అలాగే సమగ్రశిక్ష ఉద్యోగులు పక్షం రోజులుగా సమ్మెలో ఉన్నారు. వేలాది మంది ఇలా విధులు బహిష్కరించి సమ్మె చేస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఆయా రంగాలలో సేవలు నిలిచి ప్రజల ఇక్కట్లు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. పట్టణాల్లో పారిశుధ్యం పడకేసింది. విద్యాశాఖలో కార్యక్రమాలు ఆగిపోయాయి.

సమగ్ర శిక్ష ఉద్యోగుల భగ్గు

- షోకాజ్ నోటీసులు దహనం


షోకాజ్ నోటీసులను దహనం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 9 : సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర శిక్ష ఉద్యోగులు భగ్గుమన్నారు. ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట వారు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారానికి 21వరోజుకు చేరాయి. జేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, కల్యాణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో పలువురు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించని పక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ఎస్ఎస్ఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ షోకాజ్ నోటీసులను దహనం చేశారు. దీక్ష శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, కల్పనలు సందర్శించి ఉద్యోగులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, ఉదయ్, బాషా, దుర్గారావు, సుశీల, ఎస్తేరు రాణి, కొండలరాయుడు, సింగయ్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెపై ఉక్కుపాదం
దుర్మార్గం

- అంగన్‌వాడీలపై ఎస్మాను రద్దుచేయాలి
- కార్మిక, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్
- ఒంగోలులో రాస్తారోకో
- పలువురు అరెస్టు.. ఉద్రిక్తత

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : సమస్యల పరిష్కారం కోసం చిరుద్యోగులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పరిష్కరించకపోగా ఉక్కుపాదం మోపడంపై కార్మిక, ప్రజాసంఘాల నేతలు మండిపడ్డారు. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ.. మునిసిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేపట్టారు. వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతకు ముందు అక్కడ జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎస్మాను ప్రయోగిస్తూ జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, జీవీ కొండారెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊగిసలాట!

- ఆశ కల్పించారు.. కలిసే అవకాశం లేదన్నారు
- మాగుంటకు విధించిన షరతులు రద్దు
- బాలినేని అడిగిన భూసేకరణ నిధులకు ఓకే
- కానీ ఇద్దరికీ దక్కని సీఎం ఇంటర్వ్యూ
- వైసీపీలో సరికొత్త డ్రామా ప్రారంభం





(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో సరికొత్త డ్రామా ఆరంభమైంది. అధిష్ఠానంపై అసంతృప్తితో ఉండి వేరే పార్టీ వారికి టచ్‌లోకి వెళ్లారని ప్రచారం జరుగుతున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిలను కాపాడుకునేందుకు వైసీపీ సరికొత్త ఎత్తుగడ ఆరంభించింది. రాష్ట్రంలో పోలోమని నాయకులు బయట పార్టీలకు వెళ్తుండగా ఇంకొందరు తాము ఎన్నికల్లో పోటీ చేయలేమని తెగేసి చెబుతున్నారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన సీఎం జగన్ అవకాశం ఉన్న వారిని పార్టీలో నిలుపుకునేందుకు కొత్త మార్గాన్ని అనుసరించారు. అందులోభాగంగా జిల్లాలోని బాలినేని, మాగుంటలను దరిచేర్చుకునేందుకు సరికొత్త ప్రయత్నం చేస్తున్నారు. మూడురోజులుగా బాలినేనిపై విజయసాయిరెడ్డి ఒత్తిడి తెచ్చి విజయవాడ పిలిపించుకున్నారు. అలాగే మాగుంటను వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్ ప్రధాన నిర్వాహకుడు రిషిసింగ్ రప్పించుకున్నారు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరూ తాడేపల్లి చేరారు. అయితే మాగుంటకు ఐప్యాక్ ప్రతినిధులను, బాలినేనికి సీఎంవో ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసేందుకే అవకాశం దక్కింది తప్ప సీఎం కలవలేకపోయారు.

బాలినేనికి నిధుల ఆశ

ఎంపీ విజయసాయిరెడ్డి రెండుమూడు రోజులుగా బాలినేనికి ఫోన్ చేసి తాడేపల్లి రావాలని, సీఎంను కలుద్దామని ఒత్తిడి చేశారు. చివరికి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎంవోలో ఉండాలని సూచించారు. అయితే సోమవారం కుదరదన్న బాలినేని మంగళవారం కలుద్దామని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ఆయన సోమవారం సాయంత్రానికి విజయవాడ చేరారు. విజయసాయిరెడ్డితో కలిసి ఆయన సీఎంను కలవడం, రాజకీయ అంశాలన్నీ మాట్లాడుకోడానికి అవకాశం ఇవ్వకపోగా.. సీఎంవో నుంచి మాత్రం ఇంటిస్థలాల పంపిణీకి సంబంధించి భూసేకరణకు ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయబోతున్నామన్న సంకేతాన్ని బాలినేనికి పంపారు. కానీ మంగళవారం ఉదయానికి కూడా పైసా విడుదల కాలేదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం బాలినేని ధనుంజయరెడ్డి వద్దకు వెళ్లి ఈ విషయమై గట్టిగా మాట్లాడినట్లు తెలిసింది. ధనుంజయరెడ్డి మీకు నిధుల కేటాయింపు జరిగింది, బుధవారం ఉదయానికి మీకు సమాచారం వస్తుందని చెప్పి పంపినట్లు తెలిసింది. అయితే మూడురోజులుగా విజయవాడ రావాలని బాలినేనిపై ఒత్తిడి చేసిన విజయసాయి మాత్రం మంగళవారం కూడా ఆయనకు అందుబాటులోకి రాలేదని తెలిసింది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు వచ్చినందున విజయసాయి ఆ పనులపై బిజీగా ఉన్నారని మాత్రం బాలినేనికి సమాచారం ఇచ్చారు. అయితే సీఎంను కలిసే విషయంపై ఎలాంటి సమాచారం లేదు.

విమర్శించాల్సిన అవసరం లేదు..
డిపాజిట్ కూడా వద్దు!

చంద్రబాబు, పవన్, లోకేష్‌లను ఘాటుగా విమర్శించడంతోపాటు రూ.180 కోట్లు డిపాజిట్ చేయాలని ఎంపీ మాగుంటకు వైసీపీ అధిష్ఠానం షరతులు విధించిన విషయం విదితమే. వాటిని ఆయన తిరస్కరించారు కూడా. తదనంతరం మాగుంటతో టీడీపీ నాయకులు టచ్‌లో ఉన్నారంటూ విస్తృత ప్రచారం జరిగింది. అదే సమయంలో ఒంగోలు లోక్‌సభ నుంచి కొత్తగా ఎవరిని రంగంలోకి దించాలన్న అంశంపై వైసీపీ అధిష్ఠానం ముమ్మర ప్రయత్నాలు చేసింది. కొందరి పేర్లపై సర్వేలు కూడా చేసింది. మాగుంటకు చాన్స్ లేదని సీఎం జగన్ పలువురితో సూటిగానే చెప్పారు. ఈ దశలో మాగుంట తనదారి తాను చూసుకుంటున్నారంటూ ప్రచారం జరిగింది. దీంతో ఐప్యాక్ నుంచి ఆయనకు పదేపదే ఫోన్లు వచ్చాయి. ఆ సంస్థ అధిపతి రిషిసింగ్.. మాగుంటను ఇంటికొచ్చి కలుస్తానంటూ ఫోన్లు చేశాడు. చివరికి మాగుంట తానే విజయవాడ వస్తానని చెప్పి సోమవారం సాయంత్రం విజయవాడ వెళ్లారు. బాలినేనిని కలిసి మాట్లాడి రాత్రి 9గంటల తర్వాత కుమారుడు రాఘవరెడ్డితోపాటు వెళ్లి రిషిసింగ్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా మాగుంట అనేక విషయాల్లో పార్టీలో ఎదురైన అసంతృప్త అంశాలను, ప్రభుత్వపరంగా ఎదురైన ఇబ్బందులను కూడా చెప్పినట్లు తెలుస్తోంది. రాఘవరెడ్డి నిర్మొహమాటంగా కొన్ని అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. చివరికి రిషిసింగ్.. 'షరతులన్నీ రద్దయ్యాయి. మీరు ఎవరినీ విమర్శించాల్సిన అవసరం లేదు. డిపాజిట్ చేయాల్సిన పనీలేదు' అని చెప్పినట్లు తెలిసింది. మీ అవసరం వైసీపీకి ఉన్నట్లు తాము గుర్తించామని కూడా ఆయన అన్నట్లు సమాచారం. అయితే పార్టీ టికెట్, అలాగే మీ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక విషయం సీఎం చూసుకుంటారని చెప్పినట్లు తెలిసింది. అయితే సీఎం మాగుంటతో మాట్లాడతారా? లేదా? కలవాల్సి ఉంటే మాగుంటతో ఎప్పుడు భేటీ అన్న విషయంపై ఆయన స్పష్టతనివ్వలేదని తెలిసింది. దీంతో రిషిసింగ్‌తో భేటీ అనంతరం విజయవాడలో ఉన్న బాలినేనిని మరోసారి మాగుంట, ఆయన కుమారుడు కలవడం.. ఆ ముగ్గురూ ఏకాంతంగా మాట్లాడుకోవడం జరిగింది.

ఇదో నాటకం

అటు మాగుంటకు విధించిన షరతులు వెనక్కు తీసుకోవడం, ఇటు బాలినేనికి ఒంగోలులో నివాస స్థల పట్టాల పంపిణీకి అవసరమైన భూమి కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామని ఆశచూపడం వరకూ ఓకే. కానీ సీనియర్ నాయకులైన మాగుంట, బాలినేనిలతో కనీసం సీఎం మాట్లాడకపోవడం, రెండురోజుల నుంచి అందుబాటులో ఉన్నా పిలకవపోవడం అవమానకరమేనని ఆ ఇద్దరు నాయకుల అనుచరులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాత్కాలికంగా ఒకట్రెండు విషయాల్లో వారికి అనుకూలంగా వ్యవహరించి సాగదీసి చివర్లో జగన్ ఏది అనుకుంటే అదే చేస్తారని పరిశీలకుల అంచనా. ఇప్పటికీ మాగుంటకు మీరే అభ్యర్థి, ఒంగోలు లోక్‌సభకు మీరే పోటీచేయాలని చెప్పకపోవటం.. బాలినేనికి సిటింగ్ సీటు అయిన ఒంగోలుకు ఆయనతో సంబంధం లేకుండా వేరే అభ్యర్థి కోసం గాలించడం.. ఆయన పేరును మార్కాపురం, గిద్దలూరులకు పరిశీలించడం అందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

సమ్మెబాటలో 108, 104 ఉద్యోగులు

అధికారులకు నోటీసులు


డీఆర్వో శ్రీలతకు సమ్మె నోటీసు ఇస్తున్న 108, 104 ఉద్యోగులు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 9 : జిల్లాలో పనిచేస్తున్న 108, 104 ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఈనెల 22వ తేదీలోపు సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 23వతేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈమేరకు ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం డీఆర్వో ఆర్.శ్రీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి, 108, 104 మేనేజర్ జిలానీకి సమ్మె నోటీసులను అందజేశారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్యారోగ్యశాఖ, ఇతర శాఖల్లో మాదిరిగానే తమకు వెయిటేజ్ ఇచ్చి ప్రభుత్వ కొలువుల్లో నియమించాలని కోరారు. అలాగే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని, ప్రభుత్వం జారీ చేసి జీవోకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌ను యాజమాన్యం చెల్లించకుండా రెండువైపులా కార్మికుల వద్దనే కట్ చేస్తూ సంస్థకు కట్టడం లేదని యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈనెల 11న జగనన్నకు చెబుదాం, 14న ప్రజాప్రతినిధులు, మంత్రులకు వినతిపత్రాలు, ఆ తర్వాత ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా వినతులు పంపుతామని తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, 104 యూనియన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.రవివర్మ, 108 జిల్లా కోశాధికారి ఆదాం, నాయకులు భాస్కర్, రామాంజనేయులు, పవన్, స్వాతి, శ్వేత, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో జాతీయ స్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలను తిలకించేందుకు భారీగా హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) బండను లాగుతున్న ఎడ్ల జత



రంకేసిన దర్శి

- ఉత్సాహంగా ముగిసిన ఎడ్ల పోటీలు
- ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎడ్లు
- భారీగా తరలివచ్చిన జనం



దర్శి, జనవరి 9 : జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగిశాయి. చివరి రోజున మంగళవారం జరిగిన సీనియర్ కేటగిరీ పోటీల్లో 17 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంతో పేరొందిన సీనియర్ కేటగిరీ ఎడ్లు రావడంతో పోటీలను చూసేందుకు ప్రజలు పోటెత్తారు. ఆ ప్రాంగణమంతా జన సమూహంతో నిండిపోయింది. దర్శి-అద్దంకి రోడ్డు వాహనాలతో కిక్కిరిసిపోయి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎడ్ల పోటీలను తిలకించేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీలను చూసేందుకు వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. నాలుగు రోజులుగా పోటీల నిర్వహణతో దర్శిలో సంక్రాంతి శోభ ముందే కనిపించింది.


ఆర్టీసీ బస్టాండ్ సెంటరులో రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాలు


నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు


భారీగా ఆగిపోయిన వాహనాలు

అంగన్‌వాడీల నిరసన హోరు !

- ఒంగోలులో ప్రజాసంఘాల రాస్తారోకో
- 29వ రోజుకు చేరిన సమ్మె
- కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలు

ఒంగోలు నగరం, జనవరి 9: ఎస్మాను ప్రయోగించటంపై అంగన్‌వాడీలు తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మంగళవారం ఎస్మాను నిరసస్తూ ఒంగోలులో అంగన్‌వాడీలు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద 24 గంటల నిరవధిక నిరాహార దీక్షలను రిటైర్డు కాలేజి లెక్చరర్ల యూనియన్ జోనల్ కార్యదర్శి గోరంట్ల పిచ్చయ్య మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించటాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో పెద్ద ఎత్తున రాస్తారోకో జరిగింది. డిపో సెంటర్‌లో జరిగిన రాస్తారోకో ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోవటంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నివధిక నిరాహారదీక్షకు పోస్టల్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కిసాన్ మోర్చాజిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, సీఐటీయూ నాయకులు కొండారెడ్డి తదితరులు మద్దతు పలికి ప్రసంగించారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎస్మాను ఉపసంహరించుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీలు కనీస వేతనం, గ్రాట్యుటీ కోసం పోరాడుతుంటే ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదదర్శి అన్నపూర్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం సుబ్బారావు, ఎం.రమేష్, ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామారావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): అంగన్‌వాడీకార్యకర్తలు, ఆయాలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె నాగులుప్పలపాడులో కొనసాగుతోంది. మంగళవారం జరుగుతున్న ధర్నాలో రైతు సంఘం నాయకడు జె.జయంత్‌బాబు వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీకాంత్, వెంకటసుబ్బమ్మ, దుర్గాభవానీ, రమ, ఉప్పుటూరి అరుణ, రజిని, కళ్యాణి పాల్గొన్నారు.


నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న జయంత్‌బాబు

మద్దిపాడులో..

మద్దిపాడు: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్దిపాడులోని నటరాజకళాకేంద్రం వద్ద జరుగుతున్న అంగనవాడీ ధర్నాలో జీవో నెం.2 ప్రతులను దహనం చేశారు.


మద్దిపాడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఉపాధ్యాయుల ఉద్యమంపై ఉక్కుపాదం

సంఘాల నేతలకు నోటీసులు • ముఖ్యమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు

ఒంగోలు(క్రైం), జనవరి9: ఉపాధ్యాయుల ఉద్యమంపై పోలీసులు ఉక్కుపాదం మోపింది. హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం విజయవాడలో జరిగే నిరసన కార్యక్రమానికి వెళ్లనివకుండా కట్టడి చేశారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల నేతలకు ముందస్తుగా సోమవారం అర్ధరాత్రి నుంచి నోటీసులు జారీ చేసి వారు ఇంట్లో నుంచి కదలకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా 100 మందికి పైగా ఉపాధ్యాయులకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారు. అంతేగాకుండా రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్‌లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విజయవాడ వెళ్లే ఉపాధ్యాయులను అడ్డుకున్నారు. ఒంగోలులో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లతో పాటుగా జాతీయ రహదారిపై ఉత్తర బైపాస్ రోడ్డులో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఇదే విధంగా పోలీసులు ఎక్కడిక్కడ నిఘా ఉంచి విజయవాడ వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు.

చెరువుకట్ట రేవులో ఆక్రమణల తొలగింపు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి9: ఉప్పుగుండూరు ఊరచెరువు కట్ట రేవులో ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. గ్రామంలోని దేవదాయశాఖ పరిధిలోని ఊరచెరువు కట్ట రేవులో ఓ మహిళ ఆక్రమించి షెడ్డు నిర్మించింది. అయితే ఈ రేవులో హిందూ సంప్రదాయం ప్రకారం భర్తలు చనిపోయిన సమయంలో ఐదు కులాలకు చెందని మహిళలకు గాజు, పూస తొలిగించే ఆచారం ఉన్నది. కానీ ఈ రేవును ఆక్రమణ చేసి పశువుల షెడ్‌గా నిర్మిస్తే తమ సంప్రదాయాలు పాటించేందుకు భంగం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ రేవులో నిర్మించిన పశువుల షెడ్‌ను తొలగించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ హరిబాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చెరువు స్థలం దేవదాయశాఖకు చెందినదని, ఎవరూ ఎటువంటి ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్షణమే చెరువు, రేవు స్థలానికి ఫెన్సింగ్ వేయాలని దేవదాయశాఖ అధికారులకు ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో 100మందికి పైగా మహిళలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎస్ఐ హరిబాబు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు(విద్య), జనవరి 9: ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు మంగలవారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరిగాయి. ఫోరం రాష్ట్ర ప్రతినిధి టి.రమేష్ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.నాగేశ్వరరావు, వీఎస్.రవికాంత్, అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టి.అన్నపూర్ణ, ప్రధానకార్యదర్శిగా కె.రాము, ఆర్థిక కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా పీవీ.రమణయ్య, ఎస్‌కే. మొహిద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా టి.రమేష్, బి.తిరుపతయ్య, మహిళా కార్యదర్శులుగా కె.తిరుమల, వి.చైతన్యవాణి, డివిజనల్ కార్యదర్శులుగా బ్రహ్మానందరెడ్డి, కోటి ప్రసన్న, స్వర్ణలత, గౌరవ సలహాదారులుగా వి.నాగమూర్తి, కె.వాసుదేవమూర్తిలను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌బాబు, సురేంద్రరెడ్డిలు అభినందించారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతలు, ఉద్యోగ విరమణ చేయనున్న టీచర్లను సత్కరించారు.


అవార్డుగ్రహీతలను సత్కరించిన సభ్యులు

22న ఓటర్ల తుది జాబితా : ఆర్డీవో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9: ఒంగోలు నియోజకవర్గంలో ఈనెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందుగా తమకు రెండవ చోట ఓటు లేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసేందుకు నివేదికను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, కటారి సంజీవ్, స్వరూప్, గుర్రం సత్యం, రసూల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

100 మద్యం బాటిళ్ల పట్టివేత

ఒంగోలు(రూరల్), జనవరి9: ఉలిచిలోని బెల్ట్‌షాపులో ఒంగోలు తాలూకా పోలీసులు మంగళవారం దాడి చేసి 100మద్యంబాటిళ్లలను పట్టుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న గ్రామానికి బి.శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సీఐ భక్తవత్సలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలను రూపొందించాలి : డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని డీపీవో జీవీ.నారాయణరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, మండల విస్తరణాధికారులు, మండల రిసోర్స్‌పర్సన్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా ప్రణాళికలు ఉండాలన్నారు. జడ్పీసీఈవో జాలిరెడ్డి మాట్లాడుతూ ప్రణాళికల తయారీలో ఉపాధి హామీ, ఫారెస్టు, పంచాయతీరాజ్, నీటి సరఫరా తదితర శాఖలు కూడా తమ కార్యచరణ సమ్మిళితం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌ఆలీ, పీఆర్ ఎస్ఈ కొండయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- మునిసిపల్ కార్మికుల ధ్వజం

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 9 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత రెండు వారాలుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పెడచెవిన పెడుతూ పారిశుధ్య కార్మికులకు పంగనామాలు పెట్టిందని ధ్వజమెత్తారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం పదిహేనవ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. మోకాళ్లపై నిల్చొని నుదిటిన నామాలు పెట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. గత నాలుగున్నరేళ్ళుగా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో ఎదురు చూస్తే నేటికి ఎలాంటి భద్రత, భరోసా లేదన్నారు. ఒకవైపు క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంటూ పారిశుధ్యంపై గొప్పలు చెబుతున్న ప్రభుత్వం పదిహేను రోజులుగా పట్టణాలన్నీ కంపుకొడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేయడంతో చాలీ చాలని వేతనాలతో జీవనం కష్టతరంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, బాలకృష్ణ, గోపి, వెంకటేశ్వర్లు, యు.కుమారి, సామ్రాజ్యం, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఒంగోలులో కార్మికుల నిరసన

కార్మికుల నిరసన

చీమకుర్తి: చీమకుర్తిలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకుంది. మంగళవారం కార్మికులు నుదిటిపై నామాలు ధరించి ధర్నాలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాగా సమ్మె చేస్తున్న కార్మికులతో కమిషనర్ షేక్ ఫజులుల్లా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కార్మికులకు పంపిన సమాచారాన్ని చదివి వినిపించారు. కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, నాగయ్య, ఏడుకొండలు, యోహోన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో కార్మికుల నినాదాలు

తక్షణమే బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- పీడీఎస్‌యూ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నదని, అందువల్ల వెంటనే బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. మంగళవారం ఒంగోలులో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఎం.అంజిరెడ్డిని కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ఎడ్‌సెట్ ఫలితాలు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కౌన్సిలింగ్ నిర్వహించలేదని, బీఈడీకి అర్హత సాధించిన 10,908 మంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అన్ని సెట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి తరగతులు ప్రారంభం కాగా ఎడ్‌సెట్‌కు మాత్రం కౌన్సెలింగ్ నిర్వహించకపోవడం దారుణంగా ఉందన్నారు. వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులకు తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.సిసింద్రీబాబు, అన్వేష్, దాసరి వెంకటేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


వీసీ అంజిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

- మంత్రి సురేష్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9: మునిసిపల్ కార్మికుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఇప్పటికేఅనేక అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు.ఒంగోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే కార్మికులకు సంబంధించి అనేక సమస్యలను పరిష్కారం చేశారన్నారు. త్వరలో మిగిలిన అంశాలను కూడా పరిష్కరిస్తామని, ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని పరిణామాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, అది కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని సమస్యలకు జీవోలను కూడా జారీ చేశామన్నారు. మిగిలిన సమస్యలపై కార్మిక సంఘాల నాయకుల తో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నా రు. అంతకు ముందు ప్రజాసంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మంత్రి సురేష్

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

- హాజరైన జడ్పీచైర్‌పర్సన్ వెంకాయ్య

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులోని జడ్పీ కార్యాలయంలో ముందుస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి హాజరయ్యారు. కాగా చందు డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో హనుమంతరావు, ఏవో శ్రీనివాసరెడ్డి, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.విద్యాసాగర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్, పరిషత్ అధ్యక్షుడు పిట్టు శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, స్టేట్ ఆడిట్ ఏవో రమేష్, ఏఓలు సత్యంరెడ్డి, విజయలోక్ష్మి, సుశీల, రహమాన్, రవిప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో ఆడిపాడుతున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ

పలు విద్యాసంస్థల్లో..

ఒంగోలు(కల్చరల్): నగరంలోని పలు విద్యాసంస్థలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు మంగళవారం ఉత్సాహభరితంగా జరిగాయి. స్థానిక సీతారాంపురం డిల్లీ పబ్లిక్‌స్కూలులో విద్యార్థినులు రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. భోగిమంటలు వెలిగించి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం గాలిపటాల పోటీలో గెలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ పవన్ కుమార్, ప్రిన్సిపాల్ దుర్గాదేవి బహుమతులు ప్రదానం చేశారు. అటు శ్రీరాంనగర్‌లోని శ్రీరాం కాన్సెప్ట్ స్కూలులో సైతం ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ వెన్నపూస రమణారెడ్డి పాల్గొన్నారు. లాయర్‌పేట మాంటిస్సోరి పబ్లిక్ స్కూలులో ముందస్తు సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. భోగిమంట వేసి, చిన్నారులకు భోగిపళ్లు, బొమ్మలకొలువు, లక్ష్మీ పూజ మొదలైన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాశ్‌బాబు, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, నరేష్‌బాబు పాల్గొన్నారు. స్థానిక శ్రీలా స్వప్రియ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శోభాయమానంగా జరిగాయి. భోగిమంట, పొంగళ్లు, ముగ్గులతో సంక్రాంతి విశిష్టతను ప్రదర్శించారు.

సంక్రాంతి సెలవులతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిట

- రద్దీగా మారిన బస్టాండు ప్రాంగణం

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 9 : తెలుగు ప్రజలు అంత్యంత వైభవంగా జరుపుకునే సంక్రాంతి అందరికీ పెద్ద పండగ. దీంతో ఉద్యోగం, విద్య, వ్యాపార రిత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారందరూ సొంతూర్లకు వచ్చి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి సందడి చేయడం ఆనవాయితీ. ఈనెల 9వ నుంచి 18వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో రవాణా వ్యవస్థకు గిరాకీ ఏర్పడింది. మంగళవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం ప్రయాణికులతో కిటకిటలాడింది. దీంతో సీటు సంగతి దేవుడెరుగు.. కనీసం కాలు పెట్టే పరిస్థితి కూడా లేకపోవడంతో సొంతూరుకెళ్లాలన్న ఆనందంతో నిలువుకాళ్లపైనే ఇంటికి ప్రయాణమయ్యారు.


బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినులు

అవీ..ఇవీ..

విద్యార్థులకు లైఫ్‌స్కిల్‌పై శిక్షణ

ఒంగోలు(విద్య), జనవరి 9: విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించేందుకు పాఠశాల విద్యాశాఖ బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించింది. 2000 ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ పేరుతో నూతన కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సన్నాహక సమావేశాన్ని మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించగా డీఈవో వీఎస్.సుబ్బారావు, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబులు పాల్గొన్నారు. జిల్లాలోని 280 పాఠశాలల విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ అందించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. జిల్లాలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న 90 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ విద్యార్థులను మూడు పాఠశాలలకు చొప్పున ఇంటర్న్‌షిప్ అసిస్టెంట్లుగా నియమించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.12వేలు స్టైపండ్ ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆరు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుంది. విద్యార్థులకు మెరుగైన లైఫ్‌స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతుందని డీఈవో పేర్కొన్నారు.

జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనం

మద్దిపాడు, జనవరి 9 : జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం లింగంగుంటలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అన్ని వర్గాల వారికీ తగిన ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులు ప్రజలంతా చూస్తున్నారని, ప్రకృతిసంపద దోచుకోవడమే లక్ష్యంగా పాలన ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న జయంత్‌బాబు

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జనవరి 9: మోటార్‌సైకిల్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. ఒంగోలు నుండి చీరాల వైపునకు వెళ్తున్న మోటార్‌సైక్లిస్టు లారీని అధిగమించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒంగోలు నగరం మిరియాలపాలెం సెంటర్‌కు చెందిన ప్రసన్న కుమార్ గాయపడ్డాడరు. చికిత్స కోసం బాధితుడిని ఒంగోలుకు తరలించారు.

మహిళా కబడ్డీ పోటీలకు ఆహ్వానాలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి9: చీమకుర్తిలో ఈనెల 14వ తేదీన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్ ఆధ్వర్యంలో మహిళా కబడ్డీ క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈమేరకు టీడీపీ నాయకులు మంగళవారం నాగులుప్పలపాడు మండలంలోని ఓబన్నపాలెం, ఉప్పుగుండూరు, నాగులుప్పపాడు, పోతవరం, చదలవాడ, మద్దిరాలపాడు గ్రామాల్లో వారు మంగళవారం పర్యటించి మహిళా నాయకులు ఆహ్వానించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు అందజేయనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చెడుగుడు, బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు(రూరల్), జనవరి9: ఒంగోలు మండలం కరవదిలో ఈనెల 11నుంచి 14వ తేదీవరకు రాష్ట్రస్థాయి చెడుగుడను పోటీలు అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.6వేలు, చతుర్ధ బహుమతి రూ.4వేలను క్రీడాకారులకు ప్రదానం చేయనున్నారు. క్రీడాకారులు పూర్తి వివరాలకు 9703610685, 7382730961 ,9000843877 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. అదేవిదంగా మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు 11నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని, ప్రథమ బహుమతి రూ.2116, ద్వితీయ బహుమతి రూ.1016లను అందజేస్తారని, వివరాలకు 8328150782, 9440616183 సెల్ నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

గోదాదేవికి దీపారాధనల సమర్పణ

ఒంగోలు(కల్చరల్), జనవరి 9: ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి మంగళవారం ముత్తయిదువలు దీపారాధనలు సమర్పించి ఉత్సవాన్ని నిర్వహించారు. ఒంగోలు నగరం సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహిళలు తిరుప్పావై 24వ పాశురాన్ని గానం చేస్తూ అమ్మవారికి మంగళ నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తబృందం ప్రతినిధి దామచర్ల లక్ష్మీప్రసన్న కుమారి మాట్లాడుతూ నిర్మలమైన భక్తికి ప్రతీక గోదాదేవి అని, ఆమె గానం చేసిన తిరుప్పావై పాశురాలు ఎంతో పవిత్రమైనవన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అళహరి చెంచలరావు, ప్రధాన అర్చకులు శంకరమంచి సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.


దీపారాధన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

యువతి వైద్యానికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), జనవరి 9: ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన పేద యువతి వైద్యం కోసం సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కనపర్తి లక్ష్మీప్రసన్నకు రెండు కాళ్లు చచ్చుపడి వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితులలో ట్రస్ట్‌ను సంప్రదించారు. దీంతో రూ.75వేలను అందజేసినట్లు ట్రస్ట్ సలహాదారు మండవ సుబ్బారావు చెప్పారు. అదేవిధంగా ఆమె కోలుకునే వరకు ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్, నేరెళ్ల శ్రీనివాసరావు, గొల్లపూడి రవి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నగదును అందిస్తున్న సభ్యులు

రేపటి నుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

ఒంగోలు(విద్య) జనవరి 9: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ఇతర అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలకు ఈనెల 11వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు ఇస్తున్న ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక క్యాలెండర్ ప్రకారం ఈనెల 11 నుంచి 17వతేదీ వరకు కళాశాలలకు సంక్రాంతి సెలవులు. జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే సెలవులు ప్రకటించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఏ కళాశాల అయినా సంక్రాంతి సెలవులు ప్రకటిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో హెచ్చరించారు.

ఈవీఎంలపై అవగాహన

చీమకుర్తి, జనవరి 9 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వరకుమార్ పలు విషయాలు చర్చించారు. ఓటర్ల సవరణ వివరాలను తెలిపారు. పార్టీల అభిప్రాయాలను సేకరించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.


ఈవీఎంలను పరిశీలిస్తున్న వరకుమార్, నాయకులు

ఆరోగ్యసురక్షతో కార్పొరేట్ వైద్యసేవలు : డీఎంహెచ్‌వో

మద్దిపాడు, జనవరి 9: జగనన్న ఆరోగ్యసురక్షతో ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్న డీఎం హెచ్‌వో ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం సీతారాంపురం కొష్టాల వద్ద జడ్పీహైస్కూల్లో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆశాజ్యోతి, వైద్యులు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సంతనూతలపాడు, జనవరి 9: మండలంలో సాగు చేసిన మిరపపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి డి.ప్రత్యూష తెలిపారు. మండలంలోని పి.గుడిపాడు, గంగవరం గ్రామాల్లోని మిరపపంటను మంగళవారం ఆమె పరిశీలించారు. నీటిసదుపాయం ఉన్న రైతులు తప్పనిసరిగా బిందుసేద్యం, మల్చింగ్ వంటి పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు ఉచితంగా తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, తీగజాతి పంటలకోసం పందిరి అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీభమరా సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు



క్రీడాకారుల టీషర్టును ఆవిష్కరిస్తున్న గల్లా రామచంద్రరావు, సినీనటుడు రఘుబాబు



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన సినీనటుడు రఘుబాబు

మేదరమెట్ల, జనవరి 9: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్ఎస్‌సీఏ) ఆధ్వర్యంలో 30వ శ్రీభమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు మాట్లాడుతూ కరోనా కారణంగా మూడేళ్లు టోర్నమెంట్ నిర్వహించలేకపోయినప్పటికీ, తిరిగి నూతన ఉత్సాహంతో అత్యున్నత ప్రమాణాలతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.. ఇందుకు ఎంతగానో కృషిచేసిన ఆర్ఎస్‌సీఏ సభ్యులను, టోర్నమెంట్‌కు సహకరిస్తున్న శ్రీభమర టౌన్‌షిప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావును అభినందించారు. టోర్నమెంట్ నిర్వహణకు స్థానిక యువత ముందుకు రావాలని కోరారు. గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మూడు దశాబ్దాలకు పైగా అంతరరాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మారుమూల పల్లెటూరులో అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించడంతో పాటు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌సీఏ సభ్యులను అభినందించారు. రావినూతలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. అఖిల భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి మాట్లాడుతూ ఆర్ఎస్‌సీఏ స్టేడియంలో క్రికెట్ అకాడమి నెలకొల్పేందుకు రాష్ట్ర క్రికెట్ బోర్డు సభ్యులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌సీఏ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు బి.జవహర్, న్యాయవాది మోహన్‌దాస్, ఆర్ఎస్‌సీఏ సభ్యులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు విశాఖపట్నం, హైదరాబాద్ జట్లు

తొలిరోజు మ్యాచ్‌లో విశాఖపట్నం, హైదరాబాద్ జట్లు గెలుపొందాయి. కరణం పున్నయ్య చౌదరి టాస్ వేయగా రఘుబాబు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. గల్లా రామచంద్రరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉదయం జీడీసీఏ లెవెన్ గుంటూరు, సిక్కోలు సీతాస్ వైజాగ్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. టాస్ గెలిచిన వైజాగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 15 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌చేసిన వైజాగ్ జట్టు 9 ఓవర్లలోనే 90 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్, సీడీసీఏ లెవెన్ తిరుపతి జట్లు తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. ఈ జట్టులో తేజ 59 బంతులలో 119 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. అనంతరం బ్యాంటింగ్ చేసిన తిరుపతి జట్టు 18 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ అయింది.

భార్యను హత్య చేసిన భర్త

అద్దంకి, జనవరి 9: ఎనిమిదేళ్ళ క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్న వ్యక్తి అనుమానంతో భార్యను హత్యచేసిన సంఘటన మండలంలోని కలవకూరులో చోటు చేసుకుంది. కలవకూరుకు చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి 8ఏళ్ళ క్రితం శంకరవరప్పాడుకు చెందిన రాజ్యలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి సంతానం లేకపోవటం, భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో సోమవారం సాయంత్రం రోకలి బండతో దాడిచేశాడు. తీవ్రగాయాలైన రాజ్యలక్ష్మిని(27) తొలుత ఒంగోలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి, అనంతరం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి హనుమారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

పర్చూరు, జనవరి 9: మండలంలోని వీరన్నపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళతోపాటు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 77 మద్యం బాటిళ్ళను ఎస్సై రవి శంకర్‌రెడ్డి స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

దళిత ద్రోహి జగన్

మేనమామనని చెప్పి కంసమామగా మారాడు

వారికి అందే 27 పథకాలు రద్దు

వైసీపీ ప్రభుత్వంలో దళితులపై హత్యలు దాడులు, దౌర్జన్యాలు కోకొల్లలు

కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే తరిమికొడతారు

మంత్రి సురేష్‌పై ఎమ్మెల్యే స్వామి ఫైర్

సింగరాయకొండ, జనవరి 9 : దళితులకు ద్రోహం చేసిన వ్యక్తి ముమ్మాటికి జగన్‌రెడ్డేనని ఎమ్మెల్యే స్వామి విమర్శించారు. ఎస్సీలకు మేనమామనని చెప్పి ఆయన కంసమామగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరాయకొండలోని అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దళిత వ్యతిరేకని మంత్రి సురేష్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో స్థానిక గురుకుల పాఠశాలలో సైన్స్ గ్రూపును మంజూరు చేసి 160 సీట్లు, జరుగుమల్లి మండలం బిట్రగుంట కస్తుర్బా జూనియర్ కళాశాలకు 80 సీట్లు కేటాయించామని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆసీట్లన్నింటినీ రద్దు చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సుమారు 4వేల సీట్లు రద్దుచేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దీనికి మంత్రి సురేష్ సమాధానం చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో కొండపిలో ఎస్సీలకు ఉపయుక్తంగా రూ.50 లక్షలు వెచ్చించి అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తే ఈ ప్రభుత్వంలో అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. ఇక్కడే వైసీపీకి దళితులపై ఉన్న ప్రేమ అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పొన్నలూరులో రూ.5కోట్లతో ఎస్టీ గురుకుల పాఠశాలకు మంజూరు చేయిస్తే, వైసీపీ వచ్చాక ఆపనులను నిలిపివేసి గిరిజలకు ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. తమ హయాంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లను నిర్మిస్తే వైసీపీ పాలనలో ఒక్క సైడు కాలువను కూడా నిర్మించలేదన్నారు. జగన్‌రెడ్డి వచ్చాక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిగా దుర్వినియోగం చేశారని స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేసి వాటి ద్వారా ఒక్క రూపాయి కూడా దళితులకు కేటాయించలేదని వివరించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను రద్దుచేసి దళితులను విద్యకు దూరం చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీవిద్య పథకానికి జగన్ పేరు పెట్టడంలోనే వైసీపీ కుటిల బుద్ధి తేటతెల్లమైందన్నారు. మాస్కు అడిగిన పాపానికి దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి హింసించి అతని చావుకు కారణమయ్యారని దుయ్యబట్టారు. చీరాలలో మాస్కు పెట్టుకోలేదని దళిత యువకుడు కిరణ్‌ను కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను అతికిరాతంగా హత్య చేసి డోర్ డెలవరీ చేశారని గుర్తుచేశారు. అధికారపార్టీ నేతల ఇసుక అక్రమ రావాణాను ప్రశ్నిస్తే గోదావరి జిల్లాలో దళిత యువకుడికి శిరోముండనం చేసి వైసీపీ నేతలు దాష్టీకాన్ని ప్రదర్శించారని ధ్వజమెత్తారు. సురేష్ సొంత నియోజకవర్గమైన ఎర్రగొండపాలెంలో పోలీసుల వేధింపులతో దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. ఇలా.. దళితులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు జరుగుతుంటే దళితమంత్రిగా ఎందుకు నోరు మెదపలేదని మంత్రి సురేష్‌ను స్వామి ప్రశ్నించారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో కొండపి నియోజవర్గాన్ని గాలికొదిలేసి ఎన్నికలకు రెండు నెలల ముందు వచ్చి అభివృద్ధి చేస్తామని సురేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరో నెలలో ఎన్నికల కోడ్ వస్తుందని, ఈలోపు మీరు చేసే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

ఏమిటని స్వామి ప్రశ్నించారు. వైపాలెంలో గిరిజనలను మభ్యపెట్టినట్లు కొండపి నియోజకవర్గంలో ప్రజలను మోసపుచ్చలేవన్నారు. చంద్రబాబు నాయుడు కనిగిరి సభలో మాట్లాడుతూ ఒక నియోజకవర్గంలో పనికిరాని ఎమ్మెల్యే మరో నియోజవర్గంలో ఎలా పనికి వస్తారు అని ఉదహరిస్తూ ఒక చోట చెత్త మరో చోట బంగారమవుతుందా అని వ్యాఖ్యానించారన్నారు. దానిని వక్రభాష్యం చెబుతూ దళిత మంత్రిని అవమానించారని సురేష్ చెప్పుకోవడం అతని దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తనను చూసి కాకుండా జగన్‌ను చూసి ఓటువేయాలని ప్రజలను కోరడాన్ని చూస్తే ఆయనపై ఆయనకు ఎంత నమ్మకం ఉందో తేటతెల్లమవుతుందన్నారు. నియోజకవర్గంలో మిగిలి ఉన్న అభివృద్ధిని పూర్తిచేయాలంటే అందుబాటులో ఉండే తనను గెలిపించాలని స్వామి కోరారు. స్థానికేతరులను ఓటుతో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, మందలపు గాంధీచౌదరి, గుదే వెంకటేశ్వర్లు, సుదర్శి చంటి, జనసేన నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం



కొండపిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



టంగుటూరులో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

టంగుటూరు, జనవరి 9 : కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని యూటీఎఫ్ నాయకులు అన్నారు. అంగన్‌వాడీల ఆందోళన 28వ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద వారి నిరసన శిబిరాన్ని యూటీఎఫ్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఉద్యమానికి సంఘీభావ నిధి రూ.26వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నల్ల చట్టాలను ప్రయోగించి బెదిరింపులకు పాల్పడే చర్యలను మానుకోవాలని సూచించారు. ఎస్మాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పూర్ణశ్రీ, పి.వెంకట్రావు, పి.శ్రీనివాసరావు, టి.నారాయణరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రీలక్ష్మి, వెంకటరత్నం, శ్రీదేవి, సుశీల పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక మండల కార్యాలయాల ఎదుట చేస్తున్న నిరసనను మంగళవారం కూడా కొనసాగించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు గొట్టిపాటి రంగమ్మ, పున్నమ్మ, మాధవి, సాయిలీల, సుబ్బమ్మ, అనూరాధ, ప్రమీల, వసుంధర, శ్రీలక్ష్మి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు యూటీఎఫ్ మద్దతు

రూ.54వేల విరాళం అందజేత

టంగుటూరు, జనవరి 9 : సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులు, సీఆర్‌పీలు చేస్తున్న సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలిపింది. టంగుటూరులో వారు నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని ఫెడరేషన్ నాయకులు మంగళవారం సందర్శించి రూ.54వేలు విరాళంగా అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు దామచర్ల శ్రీధర్, నాయకులు ముప్పరాజు సురేష్, ఎస్‌కే మస్తాన్, పీడీ వెంకట్రావు, పుట్టా వెంకట్రావు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలి



పొగాకు అల్లకాన్ని పరిశీలిస్తున్న వేలంకేంద్రం అధికారులు

కొండపి, జనవరి 9 : పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలని రైతులకు కొండపి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ సూచించారు. మంగళవారం అనకర్లపూడి, నెన్నూరుపాడు, రామాయపాలెం, చవటపాలెం, పెట్లూరు గ్రామాల్లో పొగాకు క్షేత్ర మిత్రబృందం పర్యటించింది. పొగాకు తోటలను, క్యూరింగ్, పొగాకు మండెలను పరిశీలించింది. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ క్యూరింగ్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా వలలు ఏర్పాటు చేసుకోవాలని, బ్యారన్ పొయ్యి, గొట్టాలు డ్యామేజీ లేకుండా చూసుకోవాలన్నారు. పరిమితికి మించి పొగాకు కర్రలను బ్యారన్‌లలో పెట్టవద్దన్నారు. మండెలు చెడిపోకుండా తిరగవేసుకోవాలన్నారు. పొగాకు కంపెనీల మేనేజర్లు జి.వెంకటరావు, డీవీ రావు, రామాంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, యు.శ్రీనివాసరావు, పొగాకు వేలం కేంద్రం అధికారి టి.సిద్ధరాజు, ఎస్‌జీవో సాయికుమార్, క్షేత్ర సహాయకుడు మోతీలాల్ పాల్గొన్నారు.

పొగమల్లె ఉన్న మొక్కలను కాల్చివేయాలి...

టంగుటూరు : పొగాకు తోటల్లో ఈ ఏడాది పొగమల్లె ఎక్కువగా కనిపిస్తున్నదని విచ్చుకోకముందే అది ఆశించిన మొక్కలను పీకి కాల్చివేయాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం కె.ఉప్పలపాడు, పాలేటిపాడు, తూమాడు, కాకుటూరివారిపాలెం, జమ్ములపాలేల్లో అధికారులు పొగతోటలు, క్యూరింగ్ బ్యారన్‌లను పరిశీలించారు.

రేపటి నుంచి అనంతవరంలో నాటికల పోటీలు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 9: యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 11 నుంచి 15 వరకు ఎన్టీఆర్ కళాపరిషత్ ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం అనంతవరం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రతిరోజూ 3 నాటికలు, ఐదు రోజులలో 15 నాటికలను ప్రదర్శిస్తారన్నారు. 11 వతేదీ రాత్రి ఈ నాటికల పోటీలను ఒంగోలు ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశంలో గుదే తారకరామారావు, మద్దినేని జయరామకృష్ణ, పోపూరి సుబ్బారావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, కొరటాల వంశీ, నిమ్మల సాంబశివరావు,పెడవల్లి కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రదర్శించే నాటికలు..

11వతేదీ శార్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారిచే కొత్త పరిమళం నాటికను ప్రదర్శిస్తారు. గంగోత్రి పెదకాకాని వారితో ఆస్తికలు , మైత్రి కళా నిలయం వారితో బంధం నాటికను ప్రదర్శిస్తారు. ఈ నాటిక పోటీలకు ముందు సినీ నటుడు రఘుబాబును కమిటి సభ్యులు సత్కరిస్తారు. 12న మిత్రా క్రియేషన్స్ హైదరాబాదు వారితో కన్నీటి కథ,కళాంజలి హైదరాబాదు వారిచే రైతే రాజు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే జరుగుతున్న కథ నాటికను ప్రదర్శిస్తారు. 13వతేదీ తెలుగు కళాసమితి విశాఖపట్నం వారిచే నిశబ్ధమా నీ ఖరీదెంత, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారిచే ప్రక్షాళన, సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే మిణుగురు వెలుగులు నాటికను ప్రదర్శిస్తారు. 14వతేదీ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే కపిరాజు, రసఝరి పొన్నూరు వారిచే కాపలా, శ్రీకారం కళాపరిషత్ మార్టూరు వారిచే రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు. చివరగా 15వతేదీ అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం, చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే స్వప్నం రాల్చిన అమృతం, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారిచే రాత నాటికను ప్రదర్శిస్తారు. ముఖ్యఅతిథి సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, విశిష్ట అతిథి సినీ నటుడు అజయ్ ఘోష్‌తో పాటు సినీ దర్శకుడు గోపిచంద్ మలినేనిని కళాపరిషత్ సత్కరిస్తుంది.

ఆర్థికంగా చితికిపోయాం

చేసిన పనులు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం

వెంటనే డబ్బులు ఇప్పించండి

మంత్రి సురేష్‌కు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల వినతి

అధికారులు మాట వినడం లేదని ఫిర్యాదు



వైసీపీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సురేష్

కొండపి, జనవరి 9 : 'ఉపాధి హామీ పథకం నిధుల మ్యాచింగ్‌తో అనేక పనులు చేశాం. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌లు, బల్క్‌మిల్క్ సెంటర్‌లూ నిర్మించాం. నేటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. ఆర్థికంగా చితికిపోయాం. వెంటనే బిల్లులు ఇప్పించండి' అని రాష్ట్ర మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌ను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ఈమేరకు పెద్దఎత్తున వినతిపత్రాలు సమర్పించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో చేసిన పనులకు కూడా డబ్బులు రాలేదని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతరత్రా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం వివిధ రూపాల్లో వారిని పరుగులుపెట్టించి పనులు పూర్తి చేయించింది. దీంతో అనేక మంది అప్పులు తెచ్చి పనులు చేశారు. తీరా బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. కొందరు అప్పులకు వడ్డీలు చెల్లించలేక అవస్థపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి సురేష్ సోమవారం కొండపిలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన వద్ద గోడు వెళ్లబోసుకున్నారు.

అధికారులపై ఫిర్యాదు

మండల అధికారులు తమ మాట వినడం లేదని మంత్రి సురేష్‌కు అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, ఇతర శాఖల అధికారులు తాము అడిగిన న్యాయమైన పనులను కూడా చేయడం లేదని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి పరిస్థితిని చక్కదిద్దుతానని హామీఇచ్చారు. అంతేకాకుండా తమ పరిధిలోని ఏరుల నుంచి ఇసుకను మండలంలోని వేరే గ్రామాల వైసీపీ నాయకులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని, దీన్ని నిలువరించాలని ముసి, అట్లేరు పరివాహక ప్రాంతాల వైసీపీ నాయకులు మంత్రిని కోరారని తెలిసింది. నాయకులు చెప్పిన అన్ని సమస్యలను రాబోయే రోజుల్లో కూర్చుని పరిష్కరిస్తానని నాయకులకు మంత్రి సురేష్ హామీనిచ్చారని తెలిసింది.

మైనింగ్ అధికారుల వసూళ్లపర్వం

- ఉన్నతాధికారుల కోసమంటూ దందా

అద్దంకి, జనవరి 9: మైనింగ్ అధికారుల వసూళ్ల పర్వంతో పరిశ్రమల నిర్వాహకులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పేర్లు చెప్పి వసూలు చేయటం విమర్శలకు తావిస్తోంది. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ క్వారీలతోపాటు ఫ్యాక్టరీలు వందల సంఖ్యలో ఉన్నాయి. బల్లికురవ, అద్దంకి మండలాల్లో మెటల్ క్వారీలు, క్రషర్‌లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇటీవల కాలంలో అద్దంకి ప్రాంతంలో పర్యవేక్షణ చేసే మైనింగ్ అధికారులు భారీ మొత్తంలో వసూళ్లపర్వానికి తెరలేపారు. బడా అధికార పార్టీ నేతలను మినహాయించి మిగిలిన పరిశ్రమల యజమానులకు వసూళ్ళ షాక్ తగిలింది. ఆయా పరిశ్రమల స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కనీసం ఐదారు కోట్ల రూపాయలు వసూళ్ళు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం. అసలే గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్‌ల నిర్వాహకులు నష్టాలతో సతమతమవుతుండగా, అధికారుల వసూళ్లపర్వానికి తెరలేపటం పరిశ్రమల యజమానులలో మరింత ఆందోళన పెంచుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం ఒకవైపు అవినీతిరహిత పాలన అందిస్తున్నామని ప్రకటిస్తుండగా అధికారుల వసూళ్ళ డిమాండ్‌ను చూసి వైసీపీ నేతలు సైతం ముక్కున వేలు వేసుకుంటున్నారు. మైనింగ్ అధికారుల ఫోన్ నెంబర్‌లను కొంతమంది అధికారపార్టీ నేతలు బ్లాక్‌లిస్టులో పెట్టగా, మరి కొంత మంది మామూళ్ళు ఇచ్చే ప్రసక్తే లేదని, చేతనైనది చేసుకోండని కూడా చెప్పినట్లు సమాచారం. అత్యధికశాతం పరిశ్రమల నిర్వాహకులు మాత్రం అడిగిన కాడికి ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ వసూళ్లపర్వానికి తెరవేయాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

ఎస్మాకు బెదరం- పోరాటం వీడం

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె ● వై.పాలెంలో కళ్లకు గంతులు కట్టుకొని నిరసన ● గిద్దలూరులో బీజేపీ నేతలకు చేదు అనుభవం



వై.పాలెంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, జనవరి 9 ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ధర్నా శిబిరం వద్ద నుంచి ఎన్టీఆర్ సెంటరు మీదుగా ఎన్డీవో కార్యాలయం వరకు కళ్లకు గంతలు కట్టుకొని ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు ధర్నా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. బీజేపీ ఇన్‌చార్జి ఏ.నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, డి.బాదరయ్య గౌడ్‌లు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ర్యాలీలో సీఐటీయూ నాయకులు షేక్ రఫీ, యూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పిసుబాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి, తిరుపాలమ్మ, పాల్గొన్నారు. మూడు మండలాల నుంచి 300 మందికిపైగా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గిద్దలూరు : ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట, సచివాలయం ఎదుట ధర్నా చేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం నెలరోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు పోరాడుతున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అయితే తమపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు సైతం శిబిరం వద్దకు వచ్చి అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మీ మద్దతు మాకు వద్దు

ధర్నా చేస్తున్న అంగన్‌వాడిల వద్దకు బీజేపీ నాయకులు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మీ మద్దు, మీ పార్టీ మద్దతు, మీ సానుభూతి మాకు అవసరం లేదని నినదించారు. వీలైతే మోడీతో మాట్లాడి జగన్‌ను ఒప్పించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలన్నారు. అయితే బీజేపీ నాయకులు ఎంత చెప్పినా అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టించుకోక పోవడంతో వారు, స్థానిక తహసీల్దార్‌న కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, రెడ్డి మల్లారెడ్డి, కె.తిరుపాల్ రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడిలకు మద్దతుగా ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.




అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, కంభంలో ప్రసంగిస్తున్న ఇబ్రహీం


వై.పాలెంలో సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నేతలు

కంభం : అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఇబ్రహీం, సీపీఎం నాయకులు అన్వర్ డిమాండ్ చేశారరు. కంభం మండలం కందులాపురం కూడలిలో దీక్షలు చేపట్టిన కంభం, అర్ధవీడు, బేస్తవారపేట అంగన్‌వాడిలకు మద్దతుగా నిలిచి మాట్లాడారు. న్యాయం జరిగేంత వరకు ప్రభుత్వం ఎస్మాతో బెదిరించినా బెదిరేది లేదన్నారు. కార్యక్రమంలో సరళ, రాజేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగించడం దారుణం

పొదిలి : పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 28 రోజులుగా అంగాన్వాడీలు చేస్తున్న సమ్మెకు పరిష్కార మార్గం చూపకుండా వైసీపీ ప్రభుత్వం ఎస్మా జీవో ఇవ్వండం ఏమిటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ తక్షణమే ఆ జీవోను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్మా జీవోను రద్దు చేసి తక్షణమే పాదయాత్రలో ఇచ్చిన సమస్యలను మాట తప్పని ముఖ్యమంత్రిగా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రావ్, బి కోటేశ్వరరావు, ఆర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కార్మికులు పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెద్దదోర్నాల : న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు స్పందించాలని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గత 29 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, పదవీ విరమణ 62ఏండ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ముంతాజ్ బేగం, వెంకటలక్ష్మీ, వెంకటరత్నం, సుబ్బమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అర్ధరాత్రి అక్రమ అరెస్టులపై ఖండన


వై.పాలెంలో నోటీసులు అందజేస్తున్న పోలీసులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9 : విజయవాడ సభకు వెళ్లకుండా యూటీఎఫ్ నాయకులను అర్ధరాత్రి అడ్డుకుని నోటీసులివ్వడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒద్దుల వీరారెడ్డి బుధవారం తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన 36 గంటల దీక్షలను భగ్నం చేయడానికి పూనుకోవటం దుర్మార్గమని జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు అన్నారు.

ఎర్రగొండపాలెం : యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నాకు ఉపాధ్యాయ సంఘాల వెళ్లకుండా సోమవారం రాత్రి ఎర్రగొండపాలెం మండల యూటీఎఫ్ నాయకులకు, ఉపాధ్యాయులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ధర్నాకు వెళితే అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు తెలిపారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరనాయక్‌కు, జిల్లా కౌన్సిల్ మెంబర్లు ముటుకూరి శ్యాంరాజుతో పాటు యూటీఎఫ్ మండల నాయకులు, ఉపాధ్యాయులకు 25 మందికి నోటీసులు ఇచ్చారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్ట్ అక్రమం

పొదిలి : యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిస్కారం కోసం మంగళవారం తలపెట్టిన 36 గంటల దీక్షను భగ్నం చేయడాన్ని, నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెమ్మని బాలవెంకటేశ్వర్లు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, పీఆర్సీ, పెండింగ్ బకాయిలను చెల్లించాలనే డిమాండ్లతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంపై తాలూకా, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు తెలిపామన్నారు. అయినా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా రాత్రిపూట పోలీసులు ఇంటికి వచ్చి నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికమన్నారు. ఏపీలో సుమారుగా 5వేల మందికి నోటీసులు ఇచ్చారని, ఇది ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలన్నారు.

యూటీఎఫ్ నాయకులకు పోలీసులు నోటీసులు

పెద్దదోర్నాల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాకు అమరావతి వెళ్తున్న యూటీఎఫ్ నాయకులకు పోలీసులు సోమవారం రాత్రే నోటీసులు అందజేసినట్లు ఆ శాఖ మండల గౌరవాధ్యక్షులు మందగిరి వర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు మొద్దు నాగేశ్వరరావు, కార్యదర్శి కే.శ్రీనివాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామకృష్ణానాయక్, కోశాధికారి శ్రీకాంత్, నతానియేలుతో పాటు మరో తొమ్మిది మందికి పోలీసులు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. కేవలం సమయానికి జీతాలు ఇవ్వాలని కోరడాన్ని కూడా ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుందని విమర్శించారు.

అంబేడ్కర్, గాంధీజీలు జాతిసంపద


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అన్నా రాంబాబు

కంభం, జనవరి 9 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్‌అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీలు వంటి నేతలు జాతిసంపద అని వారిని ఒక కులానికి పరిమితం చేయకూడదని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో రాష్ట్రషెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ రానున్న తరాల ఎదుగుదల గురించి ఎంతో దూరదృష్టితో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు, పార్లమెంటు తదితర విభాగాలన్నీ రాజ్యాంగాన్ని అనుసరించి పని చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విద్యాసంస్థలకు ఆయన పేరు పెడుతున్నట్లు, మన రాష్ట్రంలో ప్రభుత్వం అంబేడ్కర్‌స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు, పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వి.రంగారావు, సీఐ రాజేష్‌కుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మీనిగ ప్రసాద్, ఎంపీడీవో ప్రసాద్, బేస్తవారపేట ఎస్సై నరసింహారావు, సర్పంచ్ రజని తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు

గిద్దలూరు, జనవరి 9 : పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అన్ని హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చాడని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. విజయ సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు నిండిన సందర్భంగా స్థానిక వైసీపీ నేతలు రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్.డి.రామక్రిష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

మార్కాపురం రూరల్ జనవరి 9: పంటలను సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని పెద్దారవీడు ఏవో బుజ్జిబాయి కోరారు. మండలంలోని పెద్దారవీడు, బి.చెర్లోపల్లి, మద్దలకట్ట, సానికవరం గ్రామాలలో రైతులు సాగుచేసిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఉండే రైతుభరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకుల ద్వారా సాగు చేసిన పైర్లను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని కోరారు. ఈ-క్రాప్ చేయించుకున్న పైర్లకు మాత్రమే ప్రభుత్వ నష్టపరిహారం, బీమా వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన రంగస్వామి

రాచర్ల, జనవరి 9 : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన రాచర్ల పంచాయతీలోని పలు గుంటిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన కె.రంగస్వామి(35) అనే యువకుడు గ్రామంలోని దూదేకుల ఖాశీం పొలంలోని వ్యవసాయ బోరు వద్దకు రాత్రి సమయంలో వెళ్లాడు. బోరుకు సంబంధించి స్టాటర్ వద్ద విద్యుత్‌షాక్ తగలడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం ఉదయం భూమి యజమాని ఖాశీం బోరు వద్దకు వెళ్లి చూడగా రంగస్వామి ముఖంపై కాలిన గుర్తులు ఉన్నాయి. దీంతో ఆయన రాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాచర్ల ఏఎస్సై ఆదిశేషయ్య మాట్లాడుతూ రంగస్వామి అక్కడకు ఎందుకు వచ్చాడు. ఎలా చనిపోయాడనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రంగస్వామికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సంఘాల హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9: గుజరాత్‌కు చెందిన బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రజా సంఘాలు మంగళవారం హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించాయి. కార్యక్రమంలో వామపక్ష నాయకులు సోమయ్య, నాసరయ్య, కాశీం, వివిధ సంఘాల నాయకులు రజాక్, అష్రఫ్, సికిందర్, రూబెన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండకు రూ.1800 కోట్లు కేటాయించాలి



మార్కాపురంలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1800 కోట్లు విడుదల చేయాలనిబీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోతే వైసీపీ ప్రజా ప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని జనవరి నెలలో వెలిగొండ ప్రాజెక్టుపై పాదయాత్ర చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.సత్యనారాయణ, సరోజిని, అజయ్, ఇన్నయ్య, బాదం మనోహర్, రామయ్య, శ్రీనివాసులు, ఆదినారాయణ, కడియం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంటవానిపల్లెలో వికసిత భారత్

పెద్ద దోర్నాల, జనవరి 9:మండలంలోని గంటవానిపల్లె గ్రామంలో మంగళవారం వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీజీ, డా బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏవో జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల భవిష్యత్ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతులకు ఏడాదికి ఆరువేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, ఆర్ఐ వీ నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి, నాయకులు అల్లూరిరెడ్డి, వైసీపీ మండల నాయకులు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసిత సంకల్ప యాత్ర

రాచర్ల : వికసిత సంకల్ప యాత్ర మండలంలోని సోమిదేవిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఎస్సీమోర్చ జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంకల్ప యాత్రను గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈనెల 16వ తేది వరకు యాత్ర జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగలగడ్డ రమాదేవి, ఎంఇఒలు కోటేశ్వరరావు, గిరిధరశర్మ, ఏవో మహబూబ్‌భాషా, ఐఒఆర్‌డి సురేష్ పాల్గొన్నారు.

అధిక ధరలు వసూలు చేయడంపై ఫిర్యాదు

ఎర్రగొండపాలెం, : ఎర్రగొండపాలెంలోని భవానీగ్యాస్ ఏజన్సీ వారు వినియోగదారుల నుంచి అధిక రేట్లు వసూళ్ళు చేస్తున్నారని మంగళవారం డిప్యూటి తహసీల్దారు రామకిష్ణకు వినతిపత్రం అందజేశారు. 14 కేజీల గ్యాస్ సిలిండరు ధర ప్రభుత్వం ధర రూ 950 రూపాయలు ఉండగా గ్రామాల్లో రూ.1050 నుంచి రూ.1090 వరకు అధికంగా నగదు వసూలు చేస్తున్నారన్నారు. రేషన్‌కార్డు ఉన్న పేద కుటుంబాలు కొత్త కనెక్షను కోసం ధరఖాస్తు చేసుకుంటే అవి సక్రమంగా ప్రభుత్వానికి పంపడం లేదని తెలిపారు. అధిక రేట్లు వసూళ్లు చేస్తున్నారని 2023 డిసెంబరు 15 వతేది తహసీల్దారుకు ఫిర్యాదు చేశామని, మరల రోజు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. బీజేపీ ఇన్‌చార్జ్ ఎ.నాగేశ్వరరావు, మండల కమిటి అధ్యక్షులు ఎం సూర్యనారాయణ, బీజేపీ నాయకులు డిప్యూటీ తహసిల్దారు రామకృష్ణఉ కలసి ఫిర్యాదు చేశారు.

టీడీపీతోనే వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలు

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 9 : టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు, ముస్లీం మైనార్టీలకు సంక్షేమ పథకాలు వస్తాయని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఎర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 'బాబుష్యూరిటీ భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు స్థానిక సంస్థలలో బీసీలకు,ఎస్సీలకు,ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి చట్టం చేశారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిరంతరం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమించారన్నారు. టీడీపీ అధికారం చేపట్టగానే జిల్లాలో మహిళలకు ఉచిత ప్రయాణం, 18 నుంచి 59 లోపు మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందుతుందన్నారు. సంత్సరంలో 3 నెలలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనంలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తితో ఒక్కొక్కరికి ఏడాదికి 15 వేలునగదు, రైతుకు ఏటా రూ.20వేలు అందజేస్తామని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే సంక్షేమ పథకాలే మీ ఇంటికి వస్తాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, పాలడుగు వెంకటకోటయ్య వేగినాటి శ్రీను, తోట మహేష్, ఎం.మంత్రునాయక్, పోక వెంకట సుబ్బయ్య, వెన్నా వెంకిరెడ్డి, పోక వెంకట సుబ్బయ్య, కందుల నారాయణరెడ్డి, కొత్త బాస్కర్, షేక్ వలి,బ్రహ్మారెడ్డి స్థానిక టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదురు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు నామాలు పెట్టుకుని, పారిశుధ్య కార్మికులు వంటా-వార్పు చేసి తమ నిరసన తెలిపారు.

గిద్దలూరు : రెండు వారాలుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు కమిషనర్ రామక్రిష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య, ఇతర విభాగాల కార్మికులు సమ్మె చేయడంతో పట్ట ణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటున్నదని, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమమింప చేయాలని బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు ఉదయ్ శంకర్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, బిజెపి నాయకులు రామాంజనేయులు, శ్రీను, రవి, తదితరులు వినతిపత్రం అందచేసిన వారిలో ఉన్నారు.


మార్కాపురంలో వంటా వార్పు చేస్తున్న కార్మికులు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9: సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని మాజీ ఎమ్మెల్యే జెంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ అన్నారు. స్థానిక సాయి బాలాజీ హైస్కూల్, వాసవీ పాఠశాల, కమలా పాఠశాలలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, జంగమదేవర, రైతు, గంగిరెద్దు వేషాలతో అలరించారు. గొబ్బిల్లమ్మ గొబ్బిలమ్మ పాటలకు నృత్యాలు చేశారు. బొమ్మల కొలువు అమర్చారు. భోగి మంటలు వేశారు. ఆ కార్యక్రమంలో సాయి బాలాజీ పాఠశాల డైరెక్టర్ ప్రకాషరావు, ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, వాసవీ పాఠశాలలో డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె.రంగయ్య, కమలా పాఠశాలలో పెనుగొండ పవన్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న జంకె వెంకటరెడ్డి

చెన్నకేశవస్వామికి ధనుర్మాస పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 9: ధనుర్మాసం పురష్కరించుకుని చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు అప్పనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావై 24వ పాశురం సందర్భంగా మహిళలు స్వామికి మంగళ నీరాజనాలు సమర్పించారు.

స్వామివారికి ముత్యాల హారతులు

త్రిపురాంతకం : మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పాత రామాలయం, కోదండ రామాలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం 24వ రోజు శ్రీగోదారంగనాయకస్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ముత్యాల హారతులు అందజేశారు. వేంకటేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.




మార్కాపురంలో ముత్యాల హారతిలో పాల్గొన్న మహిళలు, మహిళల నిరాజనాలు

దర్శిలో ముందే వచ్చిన సంక్రాంతి

- ఎడ్ల పోటీలను భారీసంఖ్యలో తిలకించిన ప్రజలు
- వినూత్నరీతిలో పోటీలు నిర్వహించిన జనసేన నేత వెంకట్
- 100 జతల ఎద్దులు పాల్గొనటం ఇదే ప్రథమం
- నాలుగు రోజుల్లో ప్రత్యక్షంగా తిలకించిన వీక్షకుల సంఖ్య లక్షకుపైనే

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సంక్రాంతి పండుగ అనగానే గ్రామసీమల్లో జరిగే వివిధ ఉత్సవాల్లో ఎద్దులతో బండలాగుడు పోటీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. జిల్లా ఏర్పాటు నుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంలోను, వేసవిలోను ఐదారు ప్రాంతాల్లో పెద్దసంఖ్యలోను మరో ఐదారు ప్రాంతాల్లో చిన్నస్థాయిలోను బండలాగుడు పోటీలు జరుగుతాయి. కానీ ఈ పోటీల చరిత్రను తిరగరాస్తూ 4 రోజులపాటు దర్శిలో జరిగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రత్యేకతను చాటుకున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 100 జతల ఎడ్లు పోటీలలో పాల్గొనటం రోజుకో విభాగం వారీ ఎక్కువమంది పోషకులకు బహుమతులు ఇవ్వటం వీక్షకులు చూసేందుకు ప్రత్యేక వసతులతో పాటు భోజన సౌకర్యాలు కూడా కల్పించటం అన్నిటికీ మించి ప్రైజ్‌మనీని పెద్దమొత్తంలో ఏర్పాటుచేయటం ఇక్కడ ప్రత్యేకత. జనసేన నాయకుడు గరికిపాటి వెంకట్ నియోజకవర్గంలోని ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా ఏర్పాటుచేసిన ఈ పోటీలు పార్టీ, కులమత రహితంగా అందరి ఆదరాభిమానాలు పొందాయంటే అతిశయోక్తి కాదు. జనసేనలో చేరి ఇటీవలే దర్శి నియోజకవర్గంకు వచ్చిన వెంకట్ నియోజకవర్గంలోనే ఉంటూ నిత్యం విభిన్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్నారు. అయితే ఈ ఎడ్ల పోటీ కార్యక్రమం అన్నింటికీ మించి ఆయన్ను ప్రజలకు మరింత చేరువచేసింది. శనివారం ప్రారంభమైన పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. రోజుకొక విభాగంగా పోటీలు జరగ్గా నాలుగురోజుల్లో 100 ఎడ్ల జతలు పోటీలలో పాల్గొనటం విశేషం. ఇంత పెద్దసంఖ్యలో గతంలో ఎన్నడూ ఎడ్లు బలప్రదర్శనకు హాజరైన దాఖలాలు లేవని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎద్దులు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోటీలలో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతల్లో రెండు విభాగాల్లో వాటికి రూ. 6వేలు, మరో రెండు విభాగాల్లోని ఎడ్ల యజమానులకు రూ. 10వేల ప్రకారం కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ పోటీలలో విజేతలకు కూడా భారీ బహుమతులే ఇచ్చారు. తొలి రెండురోజులు సుమారు 6 జతల ఎడ్లకు బహుమతులుగా రమారమి 2.5 లక్షల రూపాయలు, మూడవరోజు మూడు లక్షలు అందించారు. మూడవ రోజు ప్రథమ బహుమతి విజేతకు బుల్లెట్ వాహనాన్ని అందించటం విశేషం. ఇక మంగళవారం రాత్రి జరిగిన తుదిపోరులో విజేతగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా సుమారు 7 లక్షల విలువైన ట్రాక్టర్‌ను అందజేశారు. పోటీలలో పాల్గొనే ఎడ్లకు అవసరమైన సౌకర్యాలు, రైతులకు మంచి సౌకర్యాలు ఏర్పాటుచేయటంలో వెంకట్ సఫలీకృతం కావటంతో రోజురోజుకు పోటీలో పాల్గొనే ఎడ్ల సంఖ్య పెరిగిపోయింది. ఇంకోవైపు నియోజకవర్గ స్థాయిలో విస్తృత ప్రచారం చేశారు. అంతేగాక ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు జరిగే పోటీలను తిలకించేవారికోసం మంచి భోజన సౌకర్యం కల్పించారు. దీంతో నాలుగురోజుల్లో నియోజకవర్గానికి చెందిన సుమారు లక్షమంది పోటీలు తిలకించారంటే అతిశయోక్తి కాదు. పోటీలు జరిగే ప్రాంగణంలో ఎప్పుడు చూసినా పదివేల మందివరకు వీక్షకులు కనిపించారు. పూర్తిగా గ్రామీణప్రాంత వాతావరణంతో నిండిఉన్న దర్శి నియోజకవర్గంలో కొత్తగా రాజకీయ ఆరంగ్రేటం చేసిన గరికపాటి వెంకట్ ఈపోటీల ద్వారా యావత్తు ప్రజానీకానికి సుపరిచితులయ్యారంటే అతిశయోక్తి కాదు. జిల్లా స్థాయిలో కూడా వివిధపార్టీల నాయకులు అవైపు దృష్టి సారించటం విశేషం.


ఎడ్ల బలప్రదర్శనను వీక్షిస్తున్న ప్రజలు



పోటీలకు సిద్ధమైన స్థలం

జాతీయస్థాయి ఎడ్లపోటీలకు ఏర్పాట్లు పూర్తి

దర్శి, జనవరి 9 : బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, వైసీపీ ఆధ్వర్యంలో దర్శిలో బుధవారం నుంచి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దర్శి - పొదిలి రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఇంటి వెనుక ఖాళీ స్థలంలో పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు రోజులు జరిగే ఈ పోటీల్లో బుధవారం జూనియర్ కేటగిరీ, గురురువారం సీనియర్ కేటగిరీ ఎడ్ల పోటీలు జరుగనున్నాయి. అతిథుల కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ప్రజలు తిలకించేందుకు చుట్టూ గ్యాలరీని సిద్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి మాట్లాడుతూ జాతీయ స్థాయి ఎడ్ల పోటీలను దర్శిలో నిర్వహంచడం ఆనందంగా ఉందన్నారు. అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు ముందస్తు నోటీసులు



ప్రభుదాస్‌కు నోటీసు ఇస్తున్న పోలీస్

దొనకొండ, జనవరి 9 : ఉద్యోగుల, ఉపాధ్యాయులకు చెందిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్న డిమాండ్‌తో యూటీఎఫ్ మంగళ, బుధవారాల్లో 36 గంటల ధర్నా నిమిత్తం చలో విజయవాడ కార్యక్రమాన్ని పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఆంక్షలు విధించి ఉద్యమానికి సిద్ధమవుతున్న యూటీఎఫ్ నాయకులకు పోలీసులతో ముందస్తు నోటీసులు ఇప్పించింది. యూటీఎఫ్ శాఖ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఆదిమూలపు ప్రభుదాస్, అంజినాయక్, బత్తుల వెంకటేశ్వర్లు తదితర నాయకుల ఇళ్లకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు.

పామూరు : చలో విజయవాడకు తరలివెళ్లకుండా యూటీఎఫ్ నాయకులకు పోలీసులు సోమవారం అర్ధరాత్రి నోటీసులను ఇచ్చారు. మండలం లో మొత్తం 12 మంది యూటీఎఫ్ నాయకులకు నోటీసులు అందచేసారు. నో టీసులు అందుకున్నవారిలో రాష్ట్ర కౌన్సిల్ మాజీ మెంబర్ పేట తిరుపతిరెడ్డి మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, డోలా ఉదయకుమార్, మహిళా నాయకురాలు బీవీ లక్ష్మి ఉన్నారు.

వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకండి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, జనవరి 9 : వైసీపీ అరాచక పాలన త్వరలో ముగింపు పడనుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించా రు. నాలుగున్నరేళ్లగా వైసీపీ అరాచక పాలన సాగించిందని, దీనికి స్వస్తి పలికేందుకు ప్ర జలు సిద్ధంగా ఉన్నారని ఉగ్ర అన్నారు. టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. జగన్‌రెడ్డి వైఫల్యాలు, అవినీతి, అరాచక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు పూసి తాము కట్టించినట్లుగా అబద్ధ పు ప్రచారాలను చేయడం సిగ్గుచేటన్నారు. నా లుగన్నరేళ్లలో ఒక్కరికీ ఇంటిని కేటాయించలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై రేపు, ఎల్లుండి అంటూ నిర్లక్ష్యం చేస్తూ రైతులను, ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. రైతులకు సబ్సి డీ వ్యవసాయ పరికరాలను ఇవ్వకుండా వైసీ పీ ప్రభుత్వం మోసం చేసిందని ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీలోకి ఎవరు వచ్చినా స్వాగతించి వారితో కలిసి పనిచేయాలని స్థానిక నేతలకు ఉగ్ర సూచించారు. అనంతరం ఇమ్మడి చెరువు పంచాయతీ పాపాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గా మాత ఉత్సావాల్లో ఉగ్ర పాల్గొని మొ క్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉగ్రను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రై తు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, జి ల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, మం డల ప్రధాన కార్యదర్శి గొనా ప్రతాప్, మండల ఉపాధ్యక్షుడు మోటాటి సుబ్బారెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, కోండు భాస్కర్‌రెడ్డి, కేసరి రమణారెడ్డి, బొబ్బా నాగ భూపాల్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధికార ప్రతినిధి, గంజి రాజశేఖర్‌రెడ్డి, ముక్కు కోటిరెడ్డి, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు సరికాదు

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్నారు. వెలిగండ్ల మండలంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై ఎస్ఐతో ఉగ్ర ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ సానుభూతి పరులమీద బైండోవర్ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఈ విషయంలో కార్యకర్తలు అ ధైర్యపడవద్దని, మీకు అండగా ఉంటానని ఉగ్ర ధైర్యం చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పనిచేయండి

పామూరు, జనవరి 9 : కనిగిరిలో జనవరి 5న చంద్రబాబు ఎన్నికల శంఖారావం స భను విజయవంతం చేసినందుకు పామూ రు మండల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ధన్యవాదా లు తెలిపారు. పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వ ర్లు అధ్యక్షతన మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఒంగోలు పార్లమెంట్ స్థాయిలో కనిగిరిలో తొలి ఎన్నికల సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నిమ్జ్, రైల్వేలైన్, వెలిగొండ, ట్రిపుల్ ఐటీ, సమ్మర్ స్టోరేజీ ప్రాజెక్టుల సాధనే తన లక్ష్యమన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన మ హిళా శక్తి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అభ్యర్థుల విజయానికి శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఉగ్ర పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వైసీపీ కుట్రలను పసిగట్టి ఎదుర్కోవాలని ఉగ్ర దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏ ప్రభాకర్, అమీర్‌బాబు, ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్‌రఫీ, హరిబాబు, గౌస్‌బాషా, పందిటి హరీష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎన్.సాంబయ్య, పులినాయబ, పువ్వాడి రామారావు, చిన హజరత్, ముబినా మౌలాలి, పువ్వాడి వెంకటేశ్వర్లు, చినహజరత్, జి శ్రీను. టీ సత్యం, జాజం వెంకటేశ్వర్లు, పత్తు మస్తాన్, కౌలూరి రహంతుల్లా, కావేరి రసూల్, మెంటా నరసింహ, మోషే, తెలుగు మహిళలు సుబ్బమ్మ, ఆవుల రమణ మ్మ, నాగమణి, నూర్‌బీ పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు టీడీపీ
పలువురు పార్టీలో చేరిక



టీడీపీలో చేరిన యువకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఉగ్ర

కండువాలు కప్పి ఆహ్వానించిన ఉగ్ర

క్రమ శిక్షణకు మారు పేరు తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డా క్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శేషమహల్ థియేటర్ ప్రాంగణంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉగ్ర పా ల్గొన్నారు. తిరగళదిన్నె తెలుగు మహిళ బూత్ కమిటీ ఇన్‌చార్జి ఆవుల రమణమ్మ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన కాపు, మైనార్టీలకు చెందిన సుమారు 30 మంది యువకులు, ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరా రు. వారికి పార్టీ కండువాలతో ఉగ్ర ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ఒ క్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాలా తీయించా రన్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో సహజ వనరులను జగన్ అనుచరులు దోచుకున్నారని ఆరోపించారు. అరాచక పాలనపై ప్రజల తిరుగుబాటు ప్రారంభమైందని, అసమర్థ అరాచక రాజకీయంపై సొంత పార్టీ నేతలే అసమ్మతిగళం వినిపిస్తున్నార న్నారు. అరాచక ఉ న్మాద పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్ పాలనలో గతి త ప్పిన ఆంధ్ర రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలం టే చంద్రబాబు నాయకత్వమే శరణ్యమన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వ్యక్తులకు గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా పార్టీలో చేరేవాళ్లను కలుపుకొని ముందుకు సాగాలన్నా రు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఐక్యంగా శ్రమించాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో పాడే నరేష్, కటకం రవి, నుంకె వెంకటరత్నం, మార్గం శ్రీను, షేక్ ఖాజావలి, నుంకె సత్యనారాయణ, వై వీరకుమార్, పత్తి నారాయణ, రాగిపాటి అఖిల్, బండి పిరాబాబు, పటాన్ ఖదీర్, ఏ అశోక్, జగన్నాథం గోపి ఉ న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, దొ డ్డా వెంకటసుబ్బారెడ్డి, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్, ఎం. హుసేన్‌రావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, బీ నరసయ్య, బి.సత్యం, ఎన్.సాంబయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, జీ శ్రీనువాసులు, ముబినామౌలా లి, కౌలూరి రహంతుల్లా పువ్వాడి రామారావు, జాజం వెంకటేశ్వర్లు, చిన హజరత్ పులినాయ బ, ఎస్డీ ఖాదర్‌బాషా, మస్తాన్, మోషే, మెం టా నరసింహారావు, మహిళలు సుబ్బమ్మ, నాగమణి, షేక్‌నూర్‌బి, కాపు యూత్, పాల్గొన్నారు.



దాతలకు స్వామి ప్రసాదాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన నిత్యాన్నదానం

పామూరు, జనవరి 9 : అయ్యప్ప దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని దేవస్థాన చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజు తెలిపారు. అయ్యప్ప భక్తులకు చివరి రోజు మంగళవారం మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు, ధర్మపత్ని పార్వతి, కుమారుడు వెంకట కిశోర్‌బాబు, కోడలు మానస, రెండవ కుమారుడు వెంకట కిరణ్‌కుమార్, మూడవ కుమారుడు వెంకట జయకృష్ణ ఆర్థిక సహకారంతో భిక్షను ఏర్పాటు చేశారు. ఏటా జనవరి 9వ తేదీన అయ్యప్పలకు మిరియం రామారావు కుటుంబం ఆధ్వర్యంలో భిక్షను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి ప్రసాదాలను అందజేశారు. ప్రతిఏటా నవంబర్ 15వ తేదీ నుంచి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య కుటుంబ సభ్యులు ప్రారంభించడం, చివరి రోజు గుత్తిరాజ కుటుంబ సభ్యులతో భిక్ష ఏర్పాటు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో చిలంకూరు సర్పంచ్ మలినేని శ్రీనివాసులు దంపతులు, మిరియం పరమేశ్వరరావు, మిరియం వెంకటనారాయణ, దేవరపు రమణమ్మ, దేవస్థాన కమిటీ సభ్యులు కంభాల రోశయ్య, రాచూరి సురేష్, ఓగూరి నరసింహారావు, వాయినేని మాల్యాద్రి, గద్దె రత్తయ్య, పోశం నరసింహారావుతో పాటు అయ్యప్ప, భవాని, శివ, గోవింద, ఆంజనేయ స్వామి దీక్షధారులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పదీక్షధారులు శబరిమలైకు తరలివెళ్లారు.

ఓటర్లను భయపెడితే చెప్పండి

తాళ్లూరు, జనవరి 9 : రానున్న ఎన్నికల్లో బలహీనవర్గాల ఓటర్లను ఎవరైనా భయపెడితే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కే ప్రసాద్ తెలిపారు. బలహీన వర్గాల ఓటర్లతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎవరైనా భయాందోళనకు గురి చేస్తున్నారా అని ప్రశ్నించారు. నిర్భయంగా మీరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సెక్టార్ ఇన్‌చార్జి బి.ప్రసాదరావు, ఏ ఎస్సై మోహనరావు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేస్తున్న పోకా

పామూరు, జనవరి 9 : మండలంలోని నర్రమారెళ్ల గ్రామ పంచాయతీ చెంచిరెడ్డిపల్లిలో ప్రధానమంత్రి ఉజ్వల జ్యోతి యోజన పథకం కింద 15 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేశారు. టీఎన్ఎస్వీ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు పంపిణీ చేశారు. గ్యాస్‌లేని నిరుపేద కుటుంబాలకు కేంద్రప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లను అందజేయడం హర్షనీయమన్నారు. కేంద్ర పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టేటి మాలకొండయ్య, అమ్ములూరి దానియేలు, పిచ్చయ్య, బాలరాజు, తులసూరి కొండమ్మ, సీహెచ్ ఆదిలక్ష్మి, తిరుపతమ్మ, పద్మ, పత్తిపాటి ఆదిలక్ష్మి, పద్మ, కోటేశ్వరమ్మ, మాధవి పాల్గొన్నారు.

రబీలో ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి

పీసీపల్లి, జనవరి 9 : రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు త్వరగా ఈపంటను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి జి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని పెదఅలవలపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో మంగళవారం వీఏఏలు చేపట్టిన ఈపంట నమోదును ఆయన పరిశీలించారు. రైతులు, వ్యవసాయ సహాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రబీలో మండలం మొత్తంమీద 1469మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇప్పటివరకు కేవలం 292మంది రైతులు మాత్రమే ఈకేవైసీ పూర్తిచేసుకున్నారని మిగిలినవారు త్వరగా చేయించుకోవాలని ఆయన కోరారు.



భోగి మంటలు వెలిగిస్తున్న అధికారులు

సంప్రదాయాలను కాపాడాలి

ఎంపీడీవో యుగకీర్తి

తాళ్లూరు, జనవరి 9 : అంతరించిపోతున్న సంప్రదాయాలు, సంస్కృతులు మరిచిపోకుండా కాపాడేలా ప్రతి కుటుంబం సంక్రాంతిని సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎంపీడీవో కె.యుగకీర్తి అన్నారు. తాళ్లూరు ఏబీసీ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తు పండుగ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. మహిళల్లోని కళా నైపుణ్యాన్ని గుర్తించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న సంప్రదాయాలను అంతరించిపోకుండా చూడాలన్నారు. ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు మాట్లాడుతూ సంప్రదాయాలను అంతరించకుండా ఉండేందుకు పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. పాఠశాల డైరెక్టర్ తూము శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో ఉన్న సందడి లేదని, గతంలో సంక్రాంతి అనగానే ఇళ్ల ముందు రంగవల్లులు, అరిసెలు చేసేందుకు రోకటి శబ్దాలు, గ్రామీణ క్రీడలు కన్పించేవన్నారు. మహిళల్లోని కళా నైపుణ్యాన్ని గుర్తించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతివిశిష్టతను వివరించారు. ముగ్గుల పోటీలందు 34 మంది పాల్గొని రంగులతో ముగ్గులను సుందరంగా వేశారు. భోగిమంటలు, కోడిపందెములతో సంప్రదాయాన్ని చాటిచెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేసాబాబు, రిటైర్డ్ హెచ్‌ఎం ఐ.వెంకటరెడ్డి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, మిగతావారికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

సంక్రాంతి చిహ్నం ముత్యాల ముగ్గు



ముగ్గులు పరిశీలిస్తున్న టీచర్లు

పామూరు, జనవరి 9 : సంక్రాంతి పండుగ అంటేనే రంగు రంగుల ముగ్గులు సంప్రదాయానికి చిహ్నం లాంటివి అని ప్రిన్సిపాల్ కటకం సజన తెలిపారు. కేజీబీవీ పాఠశాల ఆవరణలో విద్యార్థినులు సంక్రాంతి ముగ్గులను శోభాయమానంగా వేసారు. వాటిని అధ్యాపక బృందం కలిసి పరిశీలించారు. నూతన సంవత్సరంలో వచ్చే తొలి తెలుగు పండుగా సంక్రాంతిని అందరూ ఆనందంగా జరుపుకోవాలని ప్రిన్సిపాల్ సజన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆగని అంగన్‌వాడీలు, కార్మికుల ఆందోళన

దర్శి జనవరి 9 : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న అంగన్‌వాడీల ఆందోళన ఆగలేదు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు ధర్నా చేశారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు టి నారాయణరెడ్డి మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తోందన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి పంపడం ఖాయమని నాయకులు అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూసీ నాయకులు సందు వెంకటేశ్వరరావు, టి రంగారావు, కార్యకర్తల యూనియన్ నాయకులు తిరుపతమ్మ, అచ్చమాంబ, పద్మావతి, నాగజ్యోతి, సుజాత, అనిత, శివకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ధర్నా

కార్మికుల సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పారిశుధ్య కార్మికులు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దెదింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు తిరుపతిరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ కోటయ్య, యూనియన్ నాయకుడు ఇత్తడి ఇర్మియా, పుల్లయ్య, మరియమ్మ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

కనిగిరి, జనవరి 9 : అంగన్‌వాడీలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా అనంతరం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఒం గోలు బస్టాండ్ వద్దకు చేరుకున్న అంగన్‌వాడీలు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. కేశవరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలపట్ల జగన్‌రెడ్డికి కాస్తంతైనా కనికరం లేకపోవటం దారుణమన్నారు. ఇలాగైతే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, రజని, భాగ్యలక్ష్మీ, రామసుబ్బులు, సీత, సుజాత, సౌందర్య ఐద్వా శాంతకుమారి, ప్రసన్న, నరేంద్ర పాల్గొన్నారు.

వంటా వార్పుతో కార్మికుల నిరసన
సంఘీబావం తెలిపిన జనసేన నాయకులు, అంగన్‌వాడీలు



కనిగిరిలో వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కా ర్మికులు మంగళవారం రోడ్డుపై వంటావార్పు కార్యక్రమంతో నిరసన చేపట్టారు. జనసేన పార్టీ నాయకులు, అంగన్‌వాడీలు వారికి సంఘీబావం తెలిపారు. జనసేన పార్టీ జిల్లా ప్రో గ్రాం కమిటీ కార్యదర్శి రామిశెట్టి సునీల్ మా ట్లాడుతూ రాష్ట్రంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతో పాటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సిబ్బంది వైసీపీ ప్రభుత్వ విధానాలతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ ఉద్యోగికీ నెలలో 1వ తేదీన జీతాలు పడడం లేదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. జగన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. దీంతో ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని రోడ్డెక్కారన్నారు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మున్సిపల్‌కార్మికులతో పాటు ఇతర ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన సీఎం జగన్‌రెడ్డి వారిపై నియంతృత్వ ధోరణితో ఉద్యమాలను అణచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీలు దాదాపు నెల రోజులుగా రో డ్లపై నిరసనలు చేస్తున్నారన్నారు. వారి పట్ల మహిళలు అనే జాలి కూడా లేకుండా వారిని పట్టనట్లు జగన్ వ్యవహరించటం దుర్మార్గం అ న్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్త, చెదారాలు సేకరి స్తూ ప్రాణాలకు తెగించి వి ధులు నిర్వహిస్తుం టే వారిపై నిర్లక్ష్య వైఖరితో ఉన్న జగన్‌ను గద్దెనుంచి దించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పా ర్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి, దొరస్వామి నాయుడు, నాయకులు రహీముల్లా, రమేష్, ఆంజనేయులు, అంజి, ఇమ్రాన్, నారాయణ, మల్లికార్జున, ప్రేమ్‌కుమార్, పవన్, అంకయ్య, బసవయ్య. వీరమహిళలు రాగి కుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే ఖాదర్‌వలి, చార్లెస్, మార్క్, ఖాసింవలి, కోటయ్య, అశోక్, సుబ్రమ ణ్యం, ఏసుబాబు, నాసర్‌వలి, కిరణ్, మధు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

దర్శి జనవరి 9 : జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా ముగిశాయి. చివరిరోజున మంగళవారం జరిగిన సీనియర్ కేటగిరీ ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు 17 జతల ఎడ్లు పాల్గొన్నాయి. జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన న్యూ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఎడ్లు 3995.2 అడుగుల దూరం బండను లాగి ప్రథమ బహుమతికి ఎంపికయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన మేకా ప్రతీకకు చెందిన ఎడ్లు 3934.5 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, నంద్యాల జిల్లా, ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 3902.5 అడుగులు లాగి మూడో స్థానం, ప్రకాశం జిల్లా, మద్దిరాముప్పాల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లు 3900 అడుగులు లాగి నాల్గో స్థానం, ప్రకాశం జిల్లా, కంభం మం డలం, దర్గా గ్రామానికి చెందిన లాయర్ కృష్ణకు చెందిన ఎడ్లు 3727.9 అడుగుల దూరం లాగి ఐదో స్థా నం, దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్‌కు చెం దిన రెండవ జత ఎడ్లు 3700.11 అడుగులు లాగి ఆరోస్థానం, జోగులాంబ గ ద్వాల్ జిల్లా, గట్టుకు చెందిన గురువా కరెప్పా ఎడ్లు 3658.8 అడుగులు లాగి ఏడో స్థానం, కృష్ణా జిల్లా, పెద్దపులిపాక గ్రామానికి చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్లు 3300 అడుగులు లాగి ఎనిమిది, హైదరాబాద్‌కు చెందిన బి రోహన్‌బాబు ఎడ్లు కూడా 3300 అడుగుల దూరం లాగి ఎనిమిదవ స్థానాలు దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 24 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు, ద్వితీయ బహుమతిగా రూ.90వేలు, మూడవ బహుమతిగా రూ.80 వేలు, నాల్గవదిగా రూ.70 వేలు, ఐదవదిగా రూ.60 వేలు, ఆరవదిగా రూ.50 వేలు, ఏడవదిగా రూ.40వేలు, ఎనిమిదవ బహుమతిగా ఇరు జట్ల యజమానులకు రూ.30 వేల చొప్పున జనస పార్టీ నేత గరికిపాటి వెంకట్ అందజేశారు.

ప్రథమ బహుమతి బుల్లెట్‌ను వెంకట్‌కు అందజేస్తున్న మాజీ మంత్రి పుల్లారావు





రాజకీయాలకు.. గుడ్ బై



- నిర్ణయించుకున్న ఎంపీ జయదేవ్
- త్వరలో పార్టీ శ్రేణులకు విందుతో వీడ్కోలు
- సీఎం జగన్ తీరుతో రాజకీయాలంటేనే విరక్తి
- హ్యాట్రిక్ కొట్టే అవకాశమున్నా పోటీకి విముఖత

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు నాకొద్దు.. పోటీ కూడా చేయను.. ఇక గుడ్‌బై.. అని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ప్రతిష్టాత్మకమైన విజయాన్ని సాధించిన జయదేవ్ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలిగేందుకు నిర్ణయించుకున్నారని తెలిసింది. తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింతగా విస్తృతం చేసుకోవాలనే లక్ష్యంతో జయదేవ్ దానిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టేందుకు రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, లోకేశ్‌తోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నా ఎన్నికల్లో పోటీకి మాత్రం ససేమిరా అంటున్నారు. సంక్రాంతి పండుగ అనంతరం తల్లి అరుణతో గుంటూరు వచ్చి ఇన్నాళ్లు తమకు అండగా నిలిచిన పార్టీ శ్రేణులకు ఆతిథ్యం ఇచ్చి వీడ్కోలు చెప్పాలనే ఆలోచనలో జయదేవ్ ఉన్నారు. కొంతకాలం క్రితం వ్యాపార వ్యవహారాల్లో ఎదురైన ఒడిదుడుకుల మూలంగా అప్పటి నుంచి ఆయన పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఎంపీ పదవికి మాత్రం న్యాయం చేస్తూ పార్లమెంటు సమావేశాల్లో పలు సమస్యలపై గళం వినిపిస్తూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్ ఎంపీ జయదేవ్‌పై పగబట్టి ఆయన పరిశ్రమలను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. చిత్తూరు జిల్లాలో ఉన్న అమరరాజా గ్రూప్ సంస్థలపైకి వివిధ ప్రభుత్వ శాఖలను ఉసిగొల్పి లేనిపోని కేసులు నమోదు చేస్తామనే బెదిరింపులతో అనేక పర్యాయాలు విసిగించారు. ఆ చర్యలతో జయదేవ్ కుటుంబీకులు మనస్తాపానికి గురయ్యారు. ఒక దశలో ఈ రాష్ట్రం నుంచే పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరలించాలని నిర్ణయించుకున్నారు. జయదేవ్ ఆలోచనను తెలుసుకున్న తెలంగాణ, తమిళనాడు ముఖ్యమంత్రులు తమ రాష్ట్రానికి రావాలంటూ జయదేవ్‌ను ఆహ్వానించారు. పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామనే భరోసా ఇచ్చారు. అయితే తాము పుట్టి పెరి గిన తిరుపతి ప్రాంత ప్రజలకు ఉపాధి లేకుండా చేయాల్సి వస్తుందనే ఆలోచనతో తరలింపు ఆలోచన ఉపసంహరించుకుని కొత్తగా తలపెట్టిన పరిశ్రమ విస్తరణకు తెలంగాణను ఎంచుకున్నారు. అక్కడ పరిశ్రమ ఏర్పాటుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల నుంచి అపకీర్తి మూటకట్టుకుంది. ఆ తర్వాత కూడా వారిని ఏదో ఒక సాకుతో వేధిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి జగన్ తీరుతో ఎంపీ జయదేవ్‌కు రాజకీయాలంటేనే విరక్తి ఏర్పడింది.

అనూహ్యంగా రాజకీయాల్లోకి..

వ్యాపారవేత్త అయిన గల్లా జయదేవ్ 2014 ఎన్నికల సమయంలో రాజకీయరంగ ప్రవేశం చేశారు. తన తాత రాజగోపాల్ నాయుడుకి సన్నిహితంగా ఉండే ఆచార్య రంగా ప్రాతినిధ్యం వహించిన గుంటూరు పార్లమెంటుపై ఉన్న మమకారంతోనే ఆయన అప్పట్లో పోటీకి ఈ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా ఆయన టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించి తొలిసారి చట్టసభలోకి అడుగు పెట్టారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఆయన గుంటూరు నుంచి పోటీ చేస్తారా, లేదా అనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల సమయం ఆసన్నమయ్యేప్పటికి ఇక్కడ నుంచే పోటీ చేస్తానని జయదేవ్ స్వయంగా ప్రకటించి ఆ ప్రచారానికి తెరదించారు. ఆచార్య ఎన్జీ రంగా వంటి సీనియర్ పార్లమెంటేరియన్ ప్రాతినిధ్యం వహించిన గుంటూరును ఎట్టి పరిస్థితుల్లో వీడనని అప్పట్లో జయదేవ్ ప్రకటించారు. 2019 ఎన్నికల్లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన జయదేవ్ వైసీపీ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని ఓడించి టీడీపీకి ప్రతిష్టాత్మకమైన విజయాన్ని చేకూర్చారు. విశేషమేమిటంటే ఆ ఎన్నికల్లో వైసీపీ గాలిలో టీడీపీ అభ్యర్థులు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరాజయం పాలైనప్పటికీ జయదేవ్ గెలిచి తన సత్తా చాటుకున్నారు.

ఉత్తిపోతలే..



నకరికల్లు వద్ద గోదావరి జలాల ఎత్తి పోతల పథకానికి నాటి సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- గోదావరి జలాలకి గ్రహణం
- నాలుగున్నరేళ్లుగా రూపాయి విదిల్చలేదు
- 10 లక్షల ఎకరాల సాగునీటి భరోసాకు గండి
- సాగర్ ఆయకట్టుకి వరప్రదాయనిలాంటి పథకం

పేరు పెట్టి అటకెక్కించారు..

నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు తరలించేలా టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఎత్తిపోతల పథకానికి జగన్ ముఖ్యమంత్రి కాగానే తన తండ్రి వైఎస్ఆర్ పేరు పెట్టు కున్నారు. అలాగే ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.6,020 కోట్లు కేటాయించి నట్లు 2020లో ప్రభుత్వం ప్రకటించింది. రెండు ప్యాకెజీలలో పనులు చేపట్టేందుకు కాంట్రా క్టర్లకు కూడా అప్పగించినట్లు తెలిపింది. అయితే ఇది ఆచరణలో అమలు కాలేదు. ఈ పథకం నిర్మాణానికి భూసేకరణ ఎక్కడవేసిన గొంగడి అక్కడనే అన్న చందాన మారింది. దీంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేశారు. ఈ పథకాన్ని సీఎం జగన్ పూర్తిగా అటకెక్కించారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గోదావరి పెన్నా నదుల అనుసందానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను నాగార్జునసాగర్ ఆయకట్టు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించింది. రూ.6020 కోట్ల అంచనాలతో ఈ పథకాన్ని రూపొందించారు. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి 66.59 కిలోమీటర్ల పొడువునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేలా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పథకాన్ని రూపొందించారు. 56.50 కిలోమీటర్లు గురు త్వాకర్షణ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయిం చారు. 20 పంపుల ద్వారా 148.68 మీటర్ల ఎత్తుకు 10.09 కిలోమీటర్ల మేర నీటిని ఎత్తి పోయాల్సి ఉంటుంది. ఆయకట్టుకు 73 టీఎం సీల నీటిని సరఫరా చేసే సామర్థ్యంతో పథకాన్ని రూపొందించారు. ఈ పథకం పూర్తి చేయడం ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు తరలించాలి. పనులకు టెండర్లు కూడా నిర్వహించారు. 3,437 ఎకరాల భూమి అవసర మవుతుందని అంచనా వేసి సర్వే కూడా పూర్తి చేశారు. భూసేకరణకు రూ.955 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. భూసేకరణ ప్రకటనను రెవెన్యూ శాఖ జారీ చేసింది. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజుపాలెం మండలాల గుండా నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాల్వలో గోదావరి నీటిని కలుపుతారు. ఎత్తిపోతల పథకం పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. రూ.2281 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.2655 కోట్లతో రెండో ప్యాకేజీగా నిర్ణయించి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవ డంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్ట లేదు. భూసేరణ ఇప్పట్లో జరిగే పరిస్థితులు కానరావడంలేదు. ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందో లేదో అన్న సందేహాలు ఆయకట్టు రైతుల్లో నెలకున్నాయి. వైసీ పీ అధికారం చేపట్టిన ఈ నాలు గున్నరేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నిధుల కొరతతో ఈ పథకం నిర్మాణం నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీలో పంటలు పండేవి. వర్షాభావం, సాగు నీటి కరువుతో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. సాగర్ ఆయకట్టు వరప్రదాయనిగా ఉన్న పథకం పనులు చేపట్టక పోవడం జగన్‌కి తమపై ఉన్న ప్రేమను తెలియ జేస్తోందని రైతులు అంటున్నారు. సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు వరప్రదాయనిగా నిలిచే పథకంపై ప్రభుత్వం శీతకన్ను వేయడంపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం గోదావరి జలాలను తరలించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకపోవడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఎత్తిపోతల పథకానికి వైఎస్ఆర్ కరువు నివారణ పథకంగా సీఎం జగన్ పేరు మార్చారు. అయితే పనులకు నిధుల విడుదలను విస్మరించారు. ఈ పథకం పూర్తయితే ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారేది.

శాశ్వత పరిష్కారం.. పట్టించుకోలేదు

గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో తరచూ కరువు పరిస్థితులు నెలకుంటున్నాయి. వర్షాభావం, సాగు నీటి కరువు పరిస్థితుల్లో లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గత టీడీపీ ప్రభుత్వం గోదావరి జలాల ఎత్తిపోతలను తెరపైకి తెచ్చింది. ఈ పథకం ద్వారా సాగర్ కుడి కాల్వకు గోదావరి జలాలను తీసుకొచ్చి సాగు, నీటి కష్టాలను తీర్చాలని ప్రణాళిక రూపొందించారు. గోదావరి జలాల తరలింపు పథకంతో ఆయా జిల్లాల్లోని సుమారు 10 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు సరఫరా అవుతాయి. పట్టిసీమ పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు కూడా గోదావరి జలాలతో మహర్దశ పట్టేది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.



నరసరావుపేట ప్రాంతంలో బీళ్లుగా మారిన పొలాలు

ఎస్మా బేఖాతరు

- పట్టు వీడని అంగన్‌వాడీలు..
- చేతులకు సంకెళ్లతో ఆందోళనలు
- జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా ఉద్యమం

బాపట్ల, జనవరి 9: ఎస్మా చట్టం పేరుతో ప్రభుత్వం బెదిరించినా అంగన్‌వాడీలు పట్టు వీడలేదు. విధుల్లో చేరే ప్రసక్తే లేదని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా అదరక బెదరక నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. కనీస వేతనం, గ్రాట్యుటీ ఇచ్చేదాకా నిరవధిక సమ్మెను విరమించేది లేదంటూ భీష్మించారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మె మంగళవారానికి 29 రోజులకు చేరింది. సమస్యలు తీరేదాకా సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని అంగన్‌వాడీలు ప్రకటించి ఆందోళనలను కొనసాగిస్తున్నారు. సమ్మె ప్రారంభం నాటి నుంచి అనేక ఆంక్షలను విధించిన ప్రభుత్వం చివరకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించి నోటీసులు జారీ చేస్తున్నా అంగన్‌వాడీలు ఉద్యమాన్ని ఉధృతంగానే కొనసాగిస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా చేతులకు సంకెళ్లతో శిబిరాల వద్ద ధర్నాలు, నిరాహార దీక్షలు, ప్రదర్శనలు, మానవహారాలు, రాస్తారోకోలు, ధర్నాలతో హోరెత్తించారు. బాపట్ల ఉప్పరపాలెంరోడ్డు వద్ద రిలే నిరాహారదీక్షలో చేతులకు సంకెళ్లు వేసుకుని అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన తమను పట్టించుకోని ఈ పాలకులు వద్దంటూ కొల్లూరులో అంగన్‌వాడీలు చేతులను నల్ల రిబ్బన్లతో కట్టుకుని నిరసన తెలిపారు. వేమూరు, భట్టిప్రోలులో తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నోటీసులు వద్దంటూ అంగన్‌వాడీలు అమృతలూరులోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి గుడి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రేపల్లెలో అంగన్‌వాడీలు చేతులకు సంకెళ్లతో ధర్నా చేశారు.



బాపట్లలో చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆకులు తింటూ బ్రతకాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎన్నికలకు సన్నద్ధం కండి

- ఓటర్ల జాబితాలో ఫిర్యాదులు రాకూడదు
- కలెక్టర్, ఎస్పీలకు సీఈసీ బృందం ఆదేశాలు

గుంటూరు, బాపట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్ కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. అధికార యంత్రాంగాన్ని ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు సీఈసీ కేంద్ర ఎన్నికల కమిషనర్లు, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారితో కలిసి మంగళవారం విజయవాడలోని నోవాటెల్‌లో సమీక్ష నిర్వహించారు. సవరణ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి డిసెంబరు 9 వరకు వచ్చిన అభ్యంతరాలు వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలపై కలెక్టర్లు సమ గ్రంగా సీఈవో బృందానికి వివరించి నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఎస్ఎస్ఆర్ కార్యకలాపాలు, ఎన్ని కల సన్నద్ధతపై కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఈసీకి నివేదించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ గురించి వివరిస్తూ ఈసీ ఆదేశాల మేరకు ప్రతీ వారం క్రమం తప్పకుండా గు ర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వ హించి అన్ని వివరాలను వారికి అందజేస్తున్నామన్నారు. ఈ సం దర్భంగా సీఈసీ మాట్లాడుతూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛీ కరించిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలన్నారు. వాటిపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసు కోవాలని స్పష్టం చేశారు. ఈసీ మార్గదర్శకాల మేరకు అధికారుల బదిలీల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షకు గుంటూరు కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పల్నాడు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవి శంకర్ రెడ్డిలు హాజరయ్యారు. బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ వివిధ అంశాలపై సీఈసీకి సమగ్ర నివేదిక ఇచ్చినట్లు సమాచారం.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

ఫాం 7 దుర్వినియోగంపై ఆరా

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఎన్నికల సన్నద్ధత తదితర అం శాలపై సీఈసీ బృందం సమీక్షించింది. పర్చూరు లో వేల సంఖ్యలో ఫాం 7 దరఖాస్తుల దుర్వినియోగంపై చర్చించినట్లు సమాచారం. ఫాం7 దుర్వినియోగం చేసిన వారిపై కేసులు నమోదు చేసిన అంశాన్ని బాపట్ల కలెక్టర్, ఎస్పీలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఫాం7 విషయంలో అవకతవక లకు పాల్పడిన వారిపై నమోదు చేసిన కేసుల విషయం లో తదుపరి పురోగతి ఏమిటన్న దానిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బృందం సమీక్షలో విపక్షాలు గతంలో ఇచ్చిన ఫిర్యా దులను దగ్గర పెట్టుకుని వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో ఒకదాని వెంట ఒకటి అడిగినట్లు తెలుస్తోంది.

గుంటూరులో.. గుంటూరు కారం

గుంటూరు కారం సినీబృందం మంగళవారం గుంటూరు సమీపంలోని పెదకాకాని వద్ద సందడి చేసింది. నంబూరు రోడ్డు వద్ద సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. పెద్దసంఖ్యలో అభిమానులు హాజరుకాగా హీరో మహేష్‌బాబు, హీరోయిన్లు శ్రీలీల, మీనాక్షిచౌదరి, నిర్మాత రాధాకృష్ణ(చిన్ని బాబు), దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లతో పాటు దిల్‌రాజు ఇతర అగ్రశ్రేణి నటులంతా పాల్గొన్నారు.

- పెదకాకాని



దగ్గుబాటితో ఆమంచి

- వాడరేవులో ఇరువురూ భేటీ
- సాధారణ కలయిక అంటున్న అనుచరులు
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

చీరాల, జనవరి 9: చీరాల మండలం వాడరేవులో డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ మంగళవారం కలిశారు. వాడరేవులో డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు చెందిన ఓ అతిథి గృహం నిర్మాణం జరుగుతోంది. ఆ పనులను పరిశీలించేందుకు డాక్టర్ దగ్గుబాటి రాగా విషయం తెలుసుకుని ఆమంచి ఆయన్ను కలిశారు. ఏకాంతంగా జరిగిన ఈ కలయిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చీరాల, పర్చూరు నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయంగా మొదటి నుంచి అవినాభావ సంబంధం ఉండటం అందుకు కారణం. అయితే డాక్టర్ దగ్గుబాటి, ఆమంచిలకు వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా స్నేహ సంబంధాలు ఉన్నాయి. గతంలో రాజకీయంగా ఇద్దరి మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. అయితే కొంతకాలంగా రాజకీయాలకు డాక్టర్ దగ్గుబాటి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఆమంచి వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా చీరాల నియోజక వర్గంలో కూడా తన ప్రత్యేక బాణీని చాటుకుంటూనే అడుగులు వేస్తున్నారు. ఆమంచి సోదరుడు, ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఆ పార్టీ చీరాల నియోజకవర్గ బాధ్యుడిగా ఉన్నారు. ఆమంచి సోదరులు గతంలో రాజకీయంగా ఉమ్మడి ప్రయాణం చేశారు. అయితే కొంతకాలంగా వారి దారులు వేరయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా దగ్గుబాటి, ఆమంచి భేటీ రాజకీయ ప్రాధాన్యతను సంతరించు కుంది. అయితే వారి కలయిక ఎప్పటి మాదిరిగానే సర్వసాధారణమేనని వారి అనుచరులు చెప్తున్నారు. 216 జాతీయ రహదారి పక్కన ఆమంచికి సంబంధించి పాశ్చాత్య మోడల్‌లో ఓ నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఇరువురూ నిర్మాణాలకు సంబంధించి వారి మధ్య చర్చ జరిగి ఉంటుందని వారి సన్నిహితులు చెప్తున్నారు.

తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నరేళ్లుగా ఎదురుచూసి విసిగిపోయిన విభిన్న వర్గాల ఉద్యోగులు పెద్దఎత్తున రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. అలాంటి వారిని సంతృప్తి పరిచి ఆయా విభాగాల్లో సమ్మెలు నివారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటం పాలకుల విధి. అయితే అందరిదీ ఒక దారి మాది మరొక దారి అన్నట్లు వ్యవహరిస్తున్న జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం చిరుద్యోగుల ఆందోళనలపైనా ఉక్కుపాదం మోపుతోంది. సానుభూతితో ఆయా వర్గాల వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సింది పోయి ఆందోళన చేస్తున్న వారిని బెదిరింపులకు గురిచేస్తోంది. అంగన్‌వాడీలపై ఏకంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన ప్రభుత్వం, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఉపాధ్యాయులను కట్టడి చేస్తోంది. ఆందోళన కార్యక్రమాలకు వెళ్లకుండా పోలీసుల ద్వారా నోటీసులు ఇచ్చి నిర్బంధిస్తోంది. చివరకు పారిశుధ్య కార్మికులపైనా తీవ్ర ఒత్తిడి చేస్తోంది.

నిర్బంధం..

- చిరుద్యోగులపై ప్రతాపం
- సమస్యలను పరిష్కరించకుండా అణచివేత
- ధర్నాకు వెళ్లకుండా ఉపాధ్యాయులు కట్టడి
- నేతలకు ముందస్తు నోటీసులు
- అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం
- ఎస్ఎస్ఏ ఉద్యోగులకు షోకాజ్‌లు
- మునిసిపల్ కార్మికులపైనా ఒత్తిడి
- భగ్గుమంటున్న ఆయా వర్గాలు, ఆందోళన ఉధృతం
- గతంలో ఇచ్చిన హామీలు అమలుతోనే సమ్మెలు ఆగుతాయని స్పష్టీకరణ

ఒంగోలు,జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిరుద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. వారి ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతోంది. చివరకు ఎస్మాను ప్రయోగించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో నాడు వైసీపీ అధినేత ప్రస్తుత సీఎం జగన్ విభిన్నవర్గాల ఉద్యోగులు, వివిధ రంగాల వారికి అనేక హామీలు ఇచ్చారు. అటు పాదయాత్ర, ఇటు ఎన్నికల ప్రచార సభల్లో పదే పదే వాటిని జగన్ ప్రచారం చేయగా వైసీపీ నేతలు అంతా క్షేత్రస్థాయి వరకు వాటిని తీసుకెళ్లారు. హామీలను నమ్మి వివిధ వర్గాల ఉద్యోగులు ఆ ఎన్నికల్లో పెద్దఎత్తున వైసీపీకి మద్దతు పలికారు. అలాంటి వారిలో అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఇతర రంగాల వారు ఉన్నారు. అయితే ప్రభుత్వంలోకి వచ్చాక వారికి ఇచ్చిన హామీలు అమలుచేయకపోగా సాధారణంగా పరిష్కరించాల్సిన సమస్యలు, జీతభత్యాలు ఇతర సర్వీసు విషయాలపై ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తొలుత ఈ పరిస్థితిపై ఏడాదిన్నర క్రితం తిరుగుబాటు ప్రకటించారు. పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అయితే నయానోభయానో ఉద్యోగసంఘాల నేతలను బెదిరించి లొంగదీసుకుని కొద్దిపాటి ఉపశమనం చర్యలు తీసుకొని వాటిని అణచివేసిన ప్రభుత్వం స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర వర్గాల చిరుద్యోగులను అసలు పట్టించుకోలేదు.

విసిగివేసారి ఉద్యమ బాట

ఈ నేపథ్యంలో నాలుగున్నరేళ్లుగా వినతులు, విజ్ఞప్తులతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దగ్గరకు తిరిగి, తిరిగి వేసారిన ఆయా రంగాల చిన్నస్థాయి ఉద్యోగులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. నెలరోజులుగా అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మునిసిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో ఆందోళన బాటపట్టారు. అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులు చివరి అస్త్రమైన సమ్మెకు దిగారు. అంగన్‌వాడీలు 28 రోజులుగా సమ్మె చేస్తుండగా మునిసిపల్ కార్మికులు 13రోజులుగా చేస్తున్నారు. అలాగే సమగ్రశిక్ష ఉద్యోగులు పక్షం రోజులుగా సమ్మెలో ఉన్నారు. వేలాది మంది ఇలా విధులు బహిష్కరించి సమ్మె చేస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఆయా రంగాలలో ప్రజల కేంద్రాలు నిలిచి ఇక్కట్లు పడుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడగా పట్టణాల్లో పారిశుధ్యం పడకేసింది. విద్యాశాఖలో కార్యక్రమాలు ఆగిపోయాయి. అంతేకాక సమ్మె చేస్తున్న వారి సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొని వారిని ఒప్పించి విధులకు హాజరయ్యేలా చూడాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వారిపై నిర్బంధం పెంచుతోంది. అంగన్‌వాడీలపై ఏకంగా ఎస్మా చట్టాలను ప్రయోగించి విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను విధులకు హాజరుకావడం లేదని షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. మునిసిపల్ కార్మికులను కూడా స్థానిక అధికారులు, వైసీపీ నేతల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఇక ఉపాధ్యాయులు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో విజయవాడలో నిరసనలకు సిద్ధం కాగా అక్కడికి వారిని వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా యూటీఎఫ్ జిల్లా, మండల స్థాయి నేతల ఇళ్లకు పోలీసులు సోమవారం రాత్రి నుంచి వెళ్లి ముందస్తు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నారు. ఈ పరిస్థితిపై ఆయా వర్గాల ఉద్యోగులు మండిపడుతున్నారు. అందులోభాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కూడా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరీ కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నిర్బంధాలను లెక్కచేయకుండా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వారికి మద్దతుగా కార్మిక సంఘాలు కూడా ఆందోళనలు చేపడుతున్నాయి.


జీవో ప్రతులను దహనం చేస్తున్న ఉద్యోగులు

భగ్గుమన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కార్యాలయం ఎదుట షోకాజ్ నోటీసులు దహనం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో భాగంగా రిలే దీక్షలు చేస్తున్న తమపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు భగ్గుమన్నారు. సమగ్ర శిక్ష జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్ష మంగళవారానికి 21వ రోజుకు చేరింది. జేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కళ్యాణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో పలువురు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని మండిపడ్డారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నుంచి ఎస్ఎస్ఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ షోకాజ్ నోటీసులను దహనం చేశారు. దీక్ష శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, కల్పనలు సందర్శించి ఉద్యోగులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, ఉదయ్, బాషా, దుర్గారావు, సుశీల, ఎస్తేరు రాణి, కొండలరాయుడు, సింగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్ల మీద నిల్చుని దండం పెడుతూ నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

సమ్మెపై నిర్బంధం తగదు

అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాను రద్దుచేయాలి

కార్మిక, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

రాస్తారోకోలో పాల్గొన్న వారు అరెస్టు, ఉద్రిక్తత

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : సమస్యల పరిష్కారం కోసం చిరుద్యోగులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పరిష్కరించకపోగా తీవ్ర నిర్బంధాన్ని విధించడంపై కార్మిక, ప్రజాసంఘాలు మండిపడ్డాయి. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ మునిసిపల్, సమగ్ర శిక్ష కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతరం రాస్తారోకో చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అక్కడి నుంచి పంపేందుకు చూశారు. చివరగా బలవంతంగా కార్మిక సంఘాల నాయకులను వాహనాల్లోకి ఎక్కించి స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అంతకు ముందు అక్కడ జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎస్మాను ప్రయోగిస్తూ జారీ చేసిన జీవోనెంబరు 2ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో నాలుగేళ్ల నుంచి విఫలమైందన్నారు. అందువల్లనే కార్మికులు, ఉద్యోగులు రోడ్డు మీదకు రావాల్సిన దుస్థితి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీభమరా సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు

మేదరమెట్ల , జనవరి 9: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్ఎస్‌సీఏ) ఆధ్వర్యంలో 30వ శ్రీభమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు మాట్లాడుతూ కరోనా కారణంగా మూడేళ్ల టోర్నమెంట్ నిర్వహించలేకపోయినప్పటికీ, తిరిగి నూతన ఉత్సాహంతో అత్యున్నత ప్రమాణాలతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు ఎంతగానో కృషిచేసిన ఆర్ఎస్‌సీఏ సభ్యులను, టోర్నమెంట్‌కు సహకరిస్తున్న శ్రీభమర టౌన్‌షిప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావును అభినందించారు. టోర్నమెంట్ నిర్వహణకు స్థానిక యువత ముందుకు రావాలని కోరారు.


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన సినీనటుడు రఘుబాబు


క్రీడాకారుల టీషర్టును ఆవిష్కరిస్తున్న గల్లా రామచంద్రరావు, సినీనటుడు రఘుబాబు

గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మూడు దశాబ్దాలకు పైగా అంతరరాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మారుమూల పల్లెటూరులో అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించడంతో పాటు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌సీఏ సభ్యులను అభినందించారు. రావినూతలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. అఖిల భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి మాట్లాడుతూ ఆర్ఎస్‌సీఏ స్టేడియంలో క్రికెట్ అకాడమి నెలకొల్పేందుకు రాష్ట్ర క్రికెట్ బోర్డు సభ్యులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌సీఏ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు బి.జవహార్, న్యాయవాది మోహన్‌దాస్, ఆర్ఎస్‌సీఏ సభ్యులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు విశాఖపట్నం, హైదరాబాద్ జట్లు

తొలిరోజు మ్యాచ్‌లో విశాఖపట్నం, హైదరాబాద్ జట్లు గెలుపొందాయి. కరణం పున్నయ్య చౌదరి టాస్ వేయగా రఘుబాబు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. గల్లా రామచంద్రరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉదయం జీడీసీఏ లెవెన్ గుంటూరు, సిక్సోలు సీతాస్ వైజాగ్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. టాస్ గెలిచిన వైజాగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 15 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌చేసిన వైజాగ్ జట్టు 9 ఓవర్లలోనే 90 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్, సీడీసీఏ లెవెన్ తిరుపతి జట్లు తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. ఈ జట్టులో తేజ 59 బంతులలో 119 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు 18 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ అయింది.

సమ్మెబాటలో 108, 104 ఉద్యోగులు

అధికారులకు నోటీసులు అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : జిల్లాలో పనిచేస్తున్న 108, 104 ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఈనెల 22వ తేదీలోపు సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 23వతేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం డీఆర్వో ఆర్.శ్రీలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, 108, 104 మేనేజర్ జిలానికి సమ్మె నోటీసులను అందజేశారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్యారోగ్యశాఖ, ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ అర్హులైన 108, 104 ఉద్యోగులకు వెయిటేజ్ ఇచ్చి ఆ ఉద్యోగాల్లో నియమించాలని కోరారు. అలాగే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఉద్యోగులను అప్కాస్‌లో చేర్చాలని, ప్రభుత్వం జారీ చేసి జీవోకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మెబాట పట్టారు. పీఎఫ్‌ను యాజమాన్యం చెల్లించకుండా రెండువైపులా కార్మికుల వద్దనే కట్ చేస్తున్నా సంస్థకు చెల్లించడం లేదని యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈనెల 11న జగనన్నకు చెబుదాం, 14న ప్రజాప్రతినిధులు, మంత్రులకు వినతిపత్రాలు, ఆ తర్వాత ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా వినతులు పంపుతామని తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, 104 యూనియన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.రవివర్మ, 108 జిల్లా కోశాధికారి ఆదాం, నాయకులు భాస్కర్, రామాంజనేయులు, పవన్, స్వాతి, శ్వేత, శేషయ్య పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ


సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 9 : రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికగర్గ్‌లు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్రంలోని కలెక్టర్లు, ఎస్పీలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాల్లో చేపట్టిన ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ప్రక్రియను కలెక్టర్ దినేష్‌కుమార్ నివేదికను అందజేశారు. ఓటర్ల జాబితా సవరణతోపాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన, స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, జిల్లాలో ఏర్పాటు చేయనున్న చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలను కలెక్టర్ ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆర్థికంగా చితికిపోయాం

చేసిన పనులు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం

వెంటనే డబ్బులు ఇప్పించండి

మంత్రి సురేష్‌కు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల వినతి


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సురేష్

కొండపి, జనవరి 9 : 'ఉపాధి హామీ పథకం నిధుల మ్యాచింగ్‌తో అనేక పనులు చేశాం. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్‌లూ నిర్మించాం. నేటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. ఆర్థికంగా చితికిపోయాం. వెంటనే బిల్లులు ఇప్పించండి' అని రాష్ట్ర మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌ను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ఈమేరకు పెద్దఎత్తున వినతిపత్రాలు సమర్పించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో చేసిన పనులకు కూడా డబ్బులు రాలేదని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతరత్రా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం వివిధ రూపాల్లో వారిని పరుగులుపెట్టించి పనులు పూర్తి చేయించింది. దీంతో అనేక మంది అప్పులు తెచ్చి పనులు చేశారు. తీరా బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. కొందరు అప్పులకు వడ్డీలు చెల్లించలేక అవస్థపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి సురేష్ సోమవారం కొండపిలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన వద్ద గోడు వెళ్లబోసుకున్నారు.

అధికారులపై ఫిర్యాదు

మండల అధికారులు తమ మాట వినడం లేదని మంత్రి సురేష్‌కు అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, ఇతర శాఖల అధికారులు తాము అడిగిన న్యాయమైన పనులను కూడా చేయడం లేదని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి పరిస్థితిని చక్కదిద్దుతానని హామీఇచ్చారు. అంతేకాకుండా తమ పరిధిలోని ఏరుల నుంచి ఇసుకను మండలంలోని వేరే గ్రామాల వైసీపీ నాయకులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని, దీన్ని నిలువరించాలని ముసి, అట్లేరు పరివాహక ప్రాంతాల వైసీపీ నాయకులు మంత్రిని కోరారని తెలిసింది.

ఊగిసలాట!

ఆశ పెట్టారు..కలిసే అవకాశం లేదన్నారు

మాగుంటకు పెట్టిన షరతులు రద్దు

బాలినేని అడిగిన భూసేకరణకు నిధులిస్తాం

కానీ వారికి దక్కని సీఎం ఇంటర్వ్యూ

వైసీపీలో సరికొత్త డ్రామా ప్రారంభం


మాగుంట


బాలినేని

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో సరికొత్త డ్రామా ఆరంభమైంది. అధిష్ఠానంపై అసంతృప్తితో ఉండి వేరే పార్టీ వారికి టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిలను కాపాడుకునేందుకు వైసీపీ సరికొత్త ఎత్తుగడను ఆరంభించింది. రాష్ట్రంలో పోలోమని నాయకులు బయట పార్టీలకు వెళ్తుండగా ఇంకొందరు తాము ఎన్నికల్లో పోటీ చేయలేమని తెగేసి చెబుతున్నారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన సీఎం జగన్ అవకాశం ఉన్న వారిని పార్టీలో నిలుపుకునేందుకు కొత్త మార్గాన్ని అనుసరించారు. అందులోభాగంగా జిల్లాలోని బాలినేని, మాగుంటలను దరిచేర్చుకునేందుకు సరికొత్త ప్రయత్నం ప్రారంభించారు. గత మూడురోజులుగా విజయసాయిరెడ్డి బాలినేనిపై వత్తిడి తెచ్చి విజయవాడ పిలిపించుకున్నారు. అలాగే మాగుంటను వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్ ప్రధాన నిర్వాహకుడు రిషిసింగ్ పిలిపించుకున్నాడు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరూ తాడేపల్లి చేరారు. అయితే మాగుంటకు ఐప్యాక్ ప్రతినిధులను బాలినేనికి సీఎంఓ ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసేందుకే అవకాశం దక్కింది తప్ప సీఎం కలవకపోవటం విశేషం.

ఇదో నాటకమా!

అటు మాగుంటకు విధించిన షరతులు వెనక్కు తీసుకోవటం ఇటు బాలినేనికి ఒంగోలులో నివాసస్థల పట్టాల పంపిణీకి అవసరమైన భూమి కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామని ఆశ చూపటం వరకు ఓకే. కానీ సీనియర్ నాయకులైన మాగుంట, బాలినేనిలతో కనీసం సీఎం మాట్లాడకపోవటం రెండురోజుల నుంచి అందుబాటులో ఉన్నా పిలకవపోవటం అవమానకరమేనని ఆ ఇద్దరు నాయకుల అనుచరులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా ఒకటిరెండు విషయాల్లో వారికి అనుకూలంగా వ్యవహరించి చివరివరకు సాగదీసి చివర్లో జగన్ ఏది అనుకుంటే అదే చేస్తాడని పరిశీలకుల అంచనా. ఇప్పటికీ మాగుంటకు మీరే అభ్యర్థిని ఒంగోలు లోక్‌సభకు మీరే పోటీచేయాలని చెప్పకపోవటం, బాలినేనికి సిటింగ్ సీటు అయిన ఒంగోలుకు ఆయనతో సంబంధం లేకుండా వేరే అభ్యర్థి కోసం గాలించటం ఆయన పేరును మార్కాపురం, గిద్దలూరులకు పరిశీలించటం అందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

మాగుంటపై విధించిన షరతులు రద్దు

చంద్రబాబు, పవన్, లోకేష్‌లను ఘాటుగా విమర్శించాలని, రూ.180 కోట్లు డిపాజిట్ చేయాలని ఎంపీ మాగుంటకు షరతులు విధించిన విషయం తెలిసిందే. ఆ షరతులను ఆయన తిరస్కరించారు కూడా. తదనంతరం మాగుంటతో టీడీపీ నాయకులు టచ్‌లో ఉన్నారంటూ విస్తృత ప్రచారం జరిగింది. అదే సమయంలో ఒంగోలు లోక్‌సభ నుంచి కొత్తగా ఎవరిని రంగంలోకి దించాలన్న అంశంపై వైసీపీ అధిష్ఠానం ముమ్మర ప్రయత్నాలు చేసింది. కొందరి పేర్లపై సర్వేలు కూడా చేశారు. సీఎం జగన్ అయితే మాగుంటకు ఛాన్స్ లేదని పలువురితో సూటిగానే చెప్పారు. ఈ దశలో మాగుంట తనదారి తను చూసుకుంటున్నారంటూ ప్రచారం జరగ్గా ఐప్యాక్ నుంచి మాగుంటకు పదేపదే ఫోన్లు వచ్చాయి. ఆ సంస్థ అధినేత రిషిసింగ్ మాగుంటను ఇంటికొచ్చి కలుస్తానంటూ ఫోన్లు చేశాడు. చివరికి మాగుంట తానే విజయవాడ వస్తానని చెప్పి సోమవారం సాయంత్రం విజయవాడ వెళ్లారు. బాలినేనితో కలిసి మాట్లాడి రాత్రి 9గంటల తర్వాత కుమారుడు రాఘవరెడ్డితో కలిసి రిషిసింగ్‌ని కలిశారు. ఆ సందర్భంగా మాగుంట అనేక విషయాల్లో పార్టీలో ఎదురైన అసంతృప్త అంశాలను, ప్రభుత్వపరంగా ఎదురైన ఇబ్బందులను కూడా చెప్పినట్లు తెలుస్తోంది. రాఘవరెడ్డి నిర్మొహమాటంగా కొన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. చివరికి రిషిసింగ్ షరతులన్నీ రద్దయ్యాయి, మీరు ఎవరినీ విమర్శించాల్సిన అవసరం లేదు, డిపాజిట్ చేయాల్సిన పనీలేదని చెప్పినట్లు తెలిసింది. మీ అవసరం వైసీపీకి ఉందని తాము గుర్తించామని కూడా ఆయన చెప్పినట్లు తెలిసింది. అయితే పార్టీ టిక్కెట్ అలాగే మీ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక విషయం సీఎం చూసుకుంటారని చెప్పినట్లు సమాచారం. అయితే సీఎం మాగుంటతో మాట్లాడతారా లేదా కలవాల్సి ఉంటే మాగుంట ఎప్పుడు కలవాలనే విషయంపై ఆయన స్పష్టతనివ్వలేదని తెలిసింది. దీంతో ఆయనతో భేటీ అనంతరం విజయవాడలో ఉన్న బాలినేనిని మరోసారి కలవటం ఆ ముగ్గురు ఏకాంతంగా మాట్లాడుకోవటం జరిగింది. సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో మాగుంట రైలులో నెల్లూరు వెళ్లగా ఆయన కుమారుడు ఒంగోలు చేరారు.

బాలినేనికి నిధుల ఆశ

రెండుమూడు రోజులుగా ఎంపీ విజయసాయిరెడ్డి బాలినేనికి ఫోన్ చేసి తాడేపల్లి రావాలని సీఎంను కలుద్దామని వత్తిడి చేశారు. చివరికి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎంఓలో ఉండాలని విజయసాయిరెడ్డి బాలినేనికి సూచించగా ఆయన సోమవారం కుదరదని మంగళవారం కలుద్దామని చెప్పినట్లు తెలిసింది. బాలినేని కూడా సోమవారం సాయంత్రానికి విజయవాడ చేరారు. విజయసాయిరెడ్డితో కలిసి ఆయన సీఎంను కలవటం, రాజకీయ అంశాలన్నీ మాట్లాడుకోటానికి అవకాశం ఇవ్వకపోగా సీఎంఓ నుంచి మాత్రం ఇంటిస్థలాల పంపిణీకి సంబంధించి భూసేకరణకు ఇవ్వాల్సిన ప్రభుత్వ నిధులను విడుదల చేయబోతున్నామన్న సంకేతాన్ని బాలినేనికి పంపారు. నిజానికి గత రెండు మూడురోజులుగా ఈ రోజు రూ.75 కోట్లు విడుదల కాబోతున్నాయి, మరో రెండురోజుల్లో మిగిలిన రూ.100 కోట్లు విడుదలవుతాయని సీఎంఓ అధికారులు జిల్లా అధికారుల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చేశారు. కానీ మంగళవారం ఉదయానికి కూడా పైసా నిధులు విడుదల కాలేదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం బాలినేని ధనుంజయరెడ్డి వద్దకు వెళ్లి ఈ విషయంపై గట్టిగా మాట్లాడినట్లు తెలిసింది. ధనుంజయరెడ్డి మీకు నిధుల కేటాయింపు జరిగింది, బుధవారం ఉదయానికి మీకు సమాచారం వస్తుందని చెప్పి పంపినట్లు తెలిసింది. అయితే మూడురోజులుగా విజయవాడ రావాలని బాలినేనిపై వత్తిడి చేసిన విజయసాయి మాత్రం మంగళవారం కూడా ఆయనకు అందుబాటులోకి రాలేదని తెలిసింది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు వచ్చినందున విజయసాయి ఆ పనులపై బిజీగా ఉన్నారని మాత్రం బాలినేనికి సమాచారం ఇచ్చారు. అయితే సీఎంను కలిసే విషయంపై ఎలాంటి సమాచారం లేదు.

వైసీపీ సాధికార బస్సు యాత్ర వాయిదా

అద్దంకి, జనవరి 9: అద్దంకిలో గురువారం జరగాల్సిన వైసీపీ సాధికార బస్సు యాత్ర వాయిదా పడటం పలు అనుమానాలకు తావిస్తుంది. అద్దంకి నియోజకవర్గంలోని వైసీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పాణెం హనిమిరెడ్డి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఏదోవిధంగా నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. రోజుకొక మండలం చొప్పున వైసీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో మండలస్థాయి నేతలు, పలు విభాగాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు రెండు వర్గాలుగా విడిపోయారు.

ఈనేపథ్యంలో వైసీపీ సాధికార బస్సు యాత్రకు బాచిన వర్గం నేతలు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో వర్గపోరు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సాధికార బస్సు యాత్ర వాయిదా పడిందన్న అనుమానాలు కలుగుతున్నాయి. బస్సు యాత్రకు హాజరు కావాల్సిన పలువురు వైసీపీ ప్రధాన నేతలు 11వ తేదీ అందుబాటులో ఉండే అవకాశం లేకపోవటంతో వాయిదా వేసినట్లు వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదిఏమైనా సాధికార బస్సు యాత్ర వాయిదా పడటాన్ని మాత్రం వైసీపీలోని రెండు వర్గాలు ఎవరికివారు తమకు అనుకూలంగా అన్వయించుకుంటున్నారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్ట్ అన్యాయం

చినగంజాం, జనవరి 9: విజయవాడలో మంగళవారం జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేసి పోలీసుస్టేషన్లకు తరలించడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.పాపారావు, మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని యూటీఎఫ్ నాయకులు పలువురికి విజయవాడ ధర్నాకు అనుమతి లేదంటూ చినగంజాం పోలీసులు నోటీసులు అందజేశారు. పాపారావు, శ్రీనివాసరావును చినగంజాం పోలీసులు సోమవారం రాత్రి 10.30 గంటలకు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్లో నిర్బంధించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక సంబంధమైన బకాయిలు విడుదల చేయాలని యూటీఎఫ్ కార్యాచరణలో భాగంగా మంగళ, బుధవారలలో విజయవాడలో 36 గంటల ధర్నాకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలను విజయవాడ వెళ్ళనీయకుండా అక్రమంగా అరెస్టులు చేసి పోలీసుస్టేషన్లలో నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మంగళవారం మధ్యాహ్నం వారిని విడుదల చేశారు.

అద్దంకిటౌన్: తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు చలో విజయవాడకు పిలుపునిచ్చాయి. ఈక్రమంలో సోమవారం రాత్రి పోలీసులు యూటీఎఫ్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. మూడు గంటల పాటు అక్కడే ఉంచి, అనంతరం నోటీసులు అందజేసి పంపించి వేశారు. యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.బాబురావు, గంగాధర్, ఇట్టా రామారావు, పూర్ణచంద్రరావు, ఎన్.హనుమంతరావుతో పాటు మరికొంత మందికి పోలీసులు వీజయవాడ ధర్నాకు వెళ్ళకుండా నోటీసులు అందజేశారు.

మార్టూరు: విజయవాడలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ధర్నాకు వెళ్లకుండా మండలంలోని ముగ్గురు యూటీఎఫ్ నాయకులను మంగళవారం వేకువ జామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సునిల్, రంగస్వామి, కందిమళ్ల రవి లను పోలీసులు వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఉదయం 7 గంటలకు నోటీసులు ఇచ్చి వదిలి పెట్టారు.

చీరాలటౌన్: విజయవాడలో మంగళవారం జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి నుండే ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. వన్‌టౌన్‌లో మాత్రం కొందరు ఉపాధ్యాయులను స్టేషన్‌కు తరలించి మంగళవారం ఉదయం విడుదల చేశారు.

రేపటి నుంచి అనంతవరంలో నాటికల పోటీలు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 9: యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 11 నుంచి 15 వరకు ఎన్టీఆర్ కళాపరిషత్ ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం అనంతవరం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రతిరోజూ 3 నాటికలు, ఐదు రోజులలో 15 నాటికలను ప్రదర్శిస్తారన్నారు. 11 వతేదీ రాత్రి ఈ నాటికల పోటీలను ఒంగోలు ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశంలో గుదే తారక రామారావు, మద్దినేని జయరామకృష్ణ, పోపూరి సుబ్బారావు, పెదవల్లి వెంకటేశ్వర్లు, కొరటాల వంశీ, నిమ్మల సాంబశివరావు,పెదవల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శించే నాటికలు.. 11వతేదీ శార్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారిచే కొత్త పరిమళం నాటికను ప్రదర్శిస్తారు. గంగోత్రి పెద కాకాని వారితో ఆస్తికలు , మైత్రి కళా నిలయం వారితో బంధం నాటికను ప్రదర్శిస్తారు. ఈ నాటిక పోటీలకు ముందు సినీ నటుడు రఘుబాబును కమిటి సభ్యులు సత్కరిస్తారు. 12న మిత్రా క్రియేషన్స్ హైదరాబాదు వారితో కన్నీటికథ,కళాంజలి హైదరాబాదు వారిచే రైతే రాజు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే జరుగుతున్న కథ నాటిక ను ప్రదర్శిస్తారు.

13వతేదీ తెలుగు కళాసమితి విశాఖ పట్నం వారిచే నిశబ్దమా నీ ఖరీదెంత, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారిచే ప్రక్షాళన, సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే మిణుగురు వెలుగులు నాటికను ప్రదర్శిస్తారు. 14వతేదీ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే కపిరాజు, రసఝరి పొన్నూరు వారిచే కాపలా, శ్రీకారం కళాపరిషత్ మార్టూరు వారిచే రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు. చివరగా 15వతేదీ అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇంద్ర ప్రస్థం, చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే స్వప్నం రాల్చిన అమృతం, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారిచే రాత నాటికను ప్రదర్శిస్తారు. ముగింపు రోజున ముఖ్యఅతిథి సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, విశిష్ట అతిథి సినీ నటుడు అజయ్ ఘోష్‌తో పాటు సినీ దర్శకుడు గోపిచంద్ మలినేనిని కళాపరిషత్ సత్కరిస్తుంది.

భార్యను హత్యచేసిన భర్త

అద్దంకి, జనవరి 9: ఎనిమిదేళ్ళ క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్న వ్యక్తి అనుమానంతో భార్యను హత్యచేసిన సంఘటన మండలంలోని కలవకూరులో చోటు చేసుకుంది. కలవకూరుకు చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి 8ఏళ్ళ క్రితం శంకరవరప్పాడుకు చెందిన రాజ్యలక్ష్మిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరికి సంతానం లేకపోవటం, భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో సోమవారం సాయంత్రం రోకలి బండతో దాడిచేశాడు. తీవ్రగాయాలైన రాజ్యలక్ష్మిని(27) తొలుత ఒంగోలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి, అనంతరం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి హనుమారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

అద్దంకి, జనవరి 9: మండలంలోని కలవకూరులో సాగర్‌బాబుకు చెందిన భూమిని అగ్రవర్ణాలకు చెందిన ప్రసాదరెడ్డి, మరో ఇద్దరు బినామీ పేర్లతో ఆక్రమించారు. మంగళవారం సాగర్‌బాబు తన భూమిలోకి వెళుతుండగా ప్రసాదరెడ్డి, మరో ఇద్దరు అడ్డగించి కులంపేరుతో దూషించారు. ఈసంఘటనపై సాగర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రవాసాంధ్రుల సాయంతో రూపుదిద్దుకున్న మహాప్రస్థానం

- రూ.కోటి యాభై లక్షలతో నిర్మాణం
- నేడు కుంకలమర్రులో ప్రారంభం



కుంకలమర్రులో రూపుదిద్దుకున్న మహా ప్రస్థానం

కుంకలమర్రు(పర్చూరు), జనవరి 9: కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో రూపుదిద్దుకున్న మహాప్రస్థానాన్ని బుధవారం ఉదయం ప్రారంభించనున్నట్లు రావి శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీచెన్నకేశవ రూరల్ డెవలప్‌మెంట్ అసోషియేషన్(ఎస్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల ఆర్థిక సహకారంతో మహా ప్రస్థానం(హిందూవ శ్మశాన వాటిక)ను నిర్మాణం చేశారు. గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు(ఎన్ఆర్ఐ)కీర్తిశేషులు రావి సుబ్బారాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.కోటి ఆర్థిక సహకారం అందించారు. అదే గ్రామానికి చెందిన వైధిన సుమంత్ ఆధ్వర్యంలో మరికొంతమంది ఎన్ఆర్ఐలు రూ.50 లక్షలు ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. రూ.కోటి యాభై లక్షలతో మహాప్రస్థానం రూపుదిద్దుకుందని శేషయ్య పేర్కొన్నారు. మహాప్రస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు, దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రవాసాంధ్రుడు రావి భాస్కరావు ఆధ్వర్యంలో మహాప్రస్థానం ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

మైనింగ్ అధికారుల వసూళ్లపర్వం

- ఉన్నతాధికారుల కోసమంటూ దందా
- పరిశ్రమల యజమానులు బెంబేలు
- కంగుతింటున్న అధికారపార్టీ నేతలు

అద్దంకి, జనవరి 9: మైనింగ్ అధికారుల వసూళ్లపర్వంతో పరిశ్రమల నిర్వాహకులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పేర్లు చెప్పి వసూలు చేయటం మరింత విమర్శలకు తావిస్తుంది. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ క్వారీలతో పాటు ఫ్యాక్టరీలు వందల సంఖ్యలో ఉన్నాయి. బల్లికురవ, అద్దంకి మండలాల్లో మెటల్ క్వారీలు, క్రషర్‌లు పదుల సంఖ్యలో ఉన్నాయి.

ఈనేపథ్యంలో ఇటీవల కాలంలో అద్దంకి ప్రాంతంలో పర్యవేక్షణ చేసే మైనింగ్ అధికారులు భారీ మొత్తంలో వసూళ్లపర్వానికి తెరలేపటం విమర్శలకు తావిస్తుంది. బడా అధికార పార్టీ నేతలను మినహాయించి మిగిలిన పరిశ్రమల యజమానులకు వసూళ్ళ షాక్ తగిలింది. ఆయా పరిశ్రమల స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కనీసం ఐదారు కోట్ల రూపాయలు వసూళ్ళ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం. మామూళ్లు ఇచ్చేందుకు నిరాకరించిన పరిశ్రమల నిర్వాహకులను దాడుల పేరుతో బెదిరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అసలే గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్‌ల నిర్వాహకులు నష్టాలతో సతమతమవుతుండగా, అధికారుల వసూళ్లపర్వానికి తెరలేపటం పరిశ్రమల యజమానులలో మరింత ఆందోళన పెంచుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం ఒకవైపు అవినీతిరహిత పాలన అందిస్తున్నామని ప్రకటిస్తుండగా అధికారుల వసూళ్ళ డిమాండ్‌ను చూసి వైసీపీ నేతలు సైతం ముక్కున వేలు వేసుకుంటున్నారు. మైనింగ్ అధికారుల ఫోన్ నెంబర్‌లను కొంతమంది అధికారపార్టీ నేతలు బ్లాక్ లిస్టులో పెట్టగా, మరికొంత మంది మామూళ్ళు ఇచ్చే ప్రసక్తే లేదని, చేతనైనది చేసుకోండని కూడా చెప్పినట్లు సమాచారం. అత్యధికశాతం పరిశ్రమల నిర్వాహకులు మాత్రం చేయగలిగింది లేక అడిగినకాడికి ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మైనింగ్ అధికారుల వసూళ్లపర్వానికి తెరవేయాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం!

- అంగన్‌వాడీలపై దుర్మార్గపు జీవోలు పని చేయవు!
- డిమాండ్‌లు పరిష్కారమయ్యే వరకు నిరసనలు
- పలు సంఘాలు సంఘీభావం



ఇంకొల్లులో రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అద్దంకిటౌన్, జనవరి 9: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారులతో, ఎస్మా జీవోలతో బెదిరిస్తే బెదిరేది లేదని, సమస్యలు పరిష్కారమయ్యేవరకు నిరసనలు కొనసాగుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య హెచ్చరించారు. మంగళవారం జైలుభరో కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముట్టడి నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, గంగయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, పలుసంఘాల నాయకలు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లనీయకుండా తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేట్లు మూసివేసి అక్కడే కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు కొంత సమయం తరువాత అదుపులోకి తీసుకున్న నాయకులును అరెస్టు చేయకుండా అక్కడే వదిలివేయడంతో నిరసనను విరమించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, కేఎల్‌డీ ప్రసాద్, రావులపల్లి కోటేశ్వరరావు, బీఎస్పీ నాయకుడు మందా జోసప్, ఆమ్‌ఆద్మి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహారావు, జైబీమ్‌రావుభారత్ పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి హేబేలు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా జీవోను ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో పలుసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

బల్లికురవ: తమకు ఉద్యోగ భద్రత కల్పించకుండా వేధింపులకు గురిచేస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని చెప్పారు. మంగళవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, నిర్మల, అనురాధ, సరస్వతి, అంజలి, అరుణ, జాస్లిన్, రాజకుమారి, శివపావని, వెంకటరమణ, చిన్నమ్మాయి , తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మార్టూరు మండల కాంప్లెక్స్ వద్ద సమ్మెను చేస్తున్న అంగన్‌వాడీలకు మంగళవారం శ్రీవిఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు కన్నె గంటి శ్రీనివాసరావు కూరగాయలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు మంగళవారం 29వ రోజు కూడా సమ్మెను కొనసాగించారు. శిబిరాన్ని సందర్శించిన టీడీపీ నేత శ్రీనివాసరావు పార్టీపరంగా మద్దతు తెలియచేసి దాదాపు 130 మంది అంగన్‌వాడీలకు కూరగాయలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీలు బైటాయింపు

ఇంకొల్లు, జనవరి 9: ఇంకొల్లులో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన సమ్మె ఉత్కంఠకు దారి తీసింది. పర్చూరు రోడ్డులో స్టేట్‌బ్యాంకు ఎదురుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి రోడ్డుపై బైటాయించారు. వీరికి టీడీపీ, జనసేన కార్యకర్తలు మద్దతు తెలిపి పాల్గొన్నారు. సుమారు గంటకు పైగా రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఎస్సై నాయబ్‌రసూల్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఆ పార్టీల నాయకులను ముందుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావును పోలీసులు బలవంతంగా వాహనంలోకి నెట్టడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అంగన్‌వాడీలను రోడ్డుపై నుంచి మహిళా కానిస్టేబుళ్లు బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసు సిబ్బంది స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు సుమారు 60 మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, టీడీపీ, జనసేన నాయకులు, సీఐటీయూ నేత వెంకట్రావును స్టేషన్‌లోనే ఉంచారు.

పర్చూరు: తమకు కనీవ వేతనం పెంచాలని, న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అని ప్రజాసంఘం నేత చింతగుంట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక సీడీపీవో కార్యాలయం నుంచి ర్యాలీగా బొమ్మల సెంటర్‌కు చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ లు, ప్రజాసంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తగిలి కారు బోల్తా



ప్రమాదంలో చెల్లచెదురుగా పడిపోయిన ట్రాక్టర్‌లోని కట్టెలు



కారులో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న ఎస్ఐ వేమన

బల్లికురవ, జనవరి 9: మండల పరిధిలోని అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయరహదారిలో వి.కొప్పెరపాడు వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన వల్లెం ఆంజనేయులు(20), తెలంగాణకు చెందిన వి. దీపక్‌రావు(41) అక్కడికక్కడే మృతి చెందారు. అందిన సమాచారం మేరకు.. గోకనకొండకు చెందిన కట్టెల ట్రాక్టర్ అద్దంకి వైపు వెళ్తాంది. కొప్పెరపాడు గ్రామ సమీపానికి వచ్చేసరికి హైదరబాద్ నారాయణ గూడకు చెందిన వి.దీపక్‌రావు కారు డ్రైవింగ్ చేస్తూ కట్టెల ట్రాక్టర్‌ను క్రాస్ చేసేందు ప్రయత్నించి కట్టెలు తగలడంతో కారు ముందుకు వెళ్ళి బోల్తా పడింది. బోల్తా పడిన కారును తప్పించేక్రమంలో ట్రాక్టర్ కూడా నామ్ రోడ్డుపై పడిపోయింది.

ఈప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న గోకనకొండకు చెందిన వల్లెం అంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు మూడుసార్లు పల్టీలు కొట్టి బోల్తా పడటంతో కారులోని డ్రైవర్ దీపక్‌రావు ఇరుక్కుపోయి ప్రాణాలు వదిలాడు. కొప్పెరపాడు సమీపంలో ప్రమాదవార్త తెలియగానే స్థానికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అడవితుమ్మ కట్టెలను ట్రాక్టర్ డోర్లు విడిసి వేసుకొని వెళ్తుండడంతో కారు డ్రైవర్‌కి దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. నామ్ రోడ్డుపై ప్రమాదం జరిగి చెల్లాచెదురు గా రెండు వాహనాలు పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.వేమన పరిశీలించి కారులో ఇరుక్కుపోయిన మృత దేహాన్ని బయటకు తీసే చర్యలు చేపట్టారు.

వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కరణం బలరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జనవరి 9: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే బలరాం విద్యుత్ అధికారులు, ఎంపీడీవో, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలో పలువురు నాయకులు తమతమ ప్రాంతాల్లో విద్యుత్‌శాఖపరంగా పరిష్కరిం చాల్సిన సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారం యుద్ధప్రాతిపదికన జరగాలని బలరాం చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ జాన్ థామస్, చీరాల, వేటపాలెం డీఈఈలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఎంపీడీవో నేతాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలి

చీరాల, జనవరి 9: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో రూసా(రాష్ట్రీయ ఉచితార్ శిక్షా అభియాన్) నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. అనంతర కళాశాలలోని గాంధీ మ్యూజియంను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మన్నేపల్లి బ్రహ్మయ్య, కళాశాల కమిటీ సభ్యులు వేణుగోపాల్, బాబాజీరావు, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

పంగులూరు, జనవరి 9: క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. మంగళ వారం మండలంలోని కొండమంజులూరులో సంక్రాంతి సందర్భంగా కేసీసీ నిర్వహిస్తున్న జాతీయస్థాయి టీ20 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతమైన కొండమంజులూరులో క్రికెట్ పోటీలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కేసీసీ చైర్మన్ కరణం స్వామి నేతృత్వంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో బీవీ కృష్ణారెడ్డి, జంపాని రవిబాబు, బొప్పూడి వెంకన్నబాబు, జంపని రాజేష్, బొప్పూడి వేణుబాబు, వీరాంజనేయులు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంపై గెలుపొందిన బుల్స్ ఒంగోలు జట్టు

ప్రారంభ మ్యాచ్‌లో ప్యాంతర్స్ శ్రీకాకుళం జట్టుపై బుల్స్ ఒంగోలు జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన బుల్స్ ఒంగోలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. 158 ప రుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బుల్స్ ఒంగోలు జట్టు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 15 ఓవర్లలో 158 పరుగులు చేసింది. బుల్స్ ఒంగోలు జట్టు క్రీడాకారుడు కె.ఆనంద్‌జోష్య 49 బంతులలో 3 సిక్స్‌లు, 12 ఫోర్లతో 80 పరుగులు సాధించారు. అచ్యుత కుమార్, పాశమ్ నవీన్‌లు చెరి రెండు వికెట్లు తీసుకుని జట్టు విజయానికి తోడ్పడ్డారు. బుధవారం జరిగే పోటీలలో ఉదయం మస్తాన్ లెవెన్ జార్ఖండ్ జట్టు, చెన్నై జట్టు తలపడనున్నాయి. సాయంత్రం జరిగే పోటీలో జడ్-11 హైదరాబాద్, మాక్ ఎస్‌జీ బళ్ళారి జట్టు పోటీ పడనున్నట్టు కరణం స్వామి తెలిపారు.



బల్లికురవ మండల వైసీపీ నేతలతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

అధిష్ఠానం పునరాలోచన చేయాలి

- వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడ్డా!
- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి. జనవరి 9: అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడ్డానని శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. అధిష్ఠానం పునరాలోచన చేసి తిరిగి తనకే టికెట్ ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు. కార్యకర్తలు, నేతలు అధైర్య పడవద్దని చెప్పారు. మంగళవారం అద్దంకి పట్టణ వైసీపీ కార్యాలయంలో బల్లికురవ మండల నేతలతో కృష్ణచైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ, జరగబోయే రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం గ్రామాల నుంచి వచ్చిన నేతల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎవరూ తొందర పడవద్దని, అందరం కలిసికట్టుగా ఉందామన్నారు. సర్వే మరలా జరుగుతందని తెలిపారు. సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు చింతల పేరయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మాదాల నాగేశ్వరరావు, జడ్పీటీసీ చింతల అంజలి శ్రీనివాసరావు, దివ్వె రామాంజనేయులు, సర్పంచ్‌లు దూళిపాళ్ల బుల్లిరామయ్య, భైలడుగు సుబ్బారావు, అమరనేని రమేష్, నేతలు గోరంట్ల వెంకటేశ్వర్లు, కమతం శ్రీను, దానానాయక్, షేక్ శ్రీనువలి, జాన్‌బాషా, మందా వీరాంజనేయులు, మక్కెన స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 9: మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరిని రెగ్యులర్‌చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరింది. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జైల్ భరో కార్యక్రమానికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, వీరయ్య, అంజమ్మ, అలివేలు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

అద్దంకిటౌన్, జనవరి 9: అద్దంకిలోని శ్రీచైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలతో కలిసి ఫాతిమా షేక్ 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫాతిమా షేక్ భారతదేశం మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు అని పేర్కొన్నారు. పూలే దంపతులతో కలిసి సంఘ సంస్కరణలు, సామాజిక కార్యక్రమాలలో పాల్గొని నిమ్న జాతులకు అపారమైన సేవలు అందించారని కొనియాడారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, అన్నమనేని వెంకటరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, త్రిమూర్తులు, దేవపాలన, మురళీకృష్ణ, తదిరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి పొందాలి

అద్దంకిటౌన్, జనవరి 9: దళిత యువత ఉపాధితో కూడిన నైపుణ్యాభివృద్ధి పొందాలని స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జె.గోపినాథ్ అన్నారు. అద్దంకిలోని వైఎస్ఆర్ కాంత్రిపథం కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం యువతకు ఉద్యోగ ఉపాధి నైపుణ్యాభివృద్ధి అవకాశాలు-సవాళ్లు అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సు డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ పులిపాటి వీరయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రిజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏపీఎం కోటేశ్వరరావు, ఉద్యాన అధికారి దీప్తి, భగవాన్‌దాస్, కె.బుజ్జిబాబు, పులిపాటి హేబేలు, ఆంజనేయులు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 9: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. కొత్తమాసు చంద్రశేఖరరావు సౌజన్యంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, మలాది శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, హెచ్‌ఎం గురవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంపూర్ణ వైద్యం అందించడమే లక్ష్యం

చినగంజాం, జనవరి 9: ఖర్చు లేకుండా ప్రతి ఇంటికి సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మున్నంవారిపాలెం సర్పంచ్ నల్లమోపు పద్మావతి, ఎంపీడీవో కె.స్వరూపరాణి అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.వి జయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ కె.షణ్ముఖశ్రీ, డాక్టర్ జి.పృధ్వీలు 348 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డీవోఏ పి.వెంకటేశ్వర్లు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరత్నం, చినగంజాం పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎస్.బేబి, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్బారాణి, పొదలి రాఘవ, ఎన్.మురళి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

మార్టూరు, జనవరి 9: మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కరెంటు మీటర్లు తిరగకుండా ఏర్పాటుచేసిన ఇద్దరు వినియోగదారులకు, 38 మంది అదనపు లోడు వినియోగించేవారిని గుర్తించి రూ.2 లక్షల 81 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలలో అద్దంకి ఈఈ ఎన్.మస్తానరావు, మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

పర్చూరు, జనవరి 9: మండలంలోని వీరన్నపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళతోపాటు, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 77 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై రవి శంకర్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

చీరాల, జనవరి 9: టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమర్‌నాథ్ అన్నారు. మండలంలోని దేవినూతలలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి జయహో బీసీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వల్లు చినరాఘవులు, మల్లవరపు శ్రీను, నల్లమేకల సోమయ్య, మల్లవరపు వెంకటశివయ్య, గడ్డం నీవన్, గంజి పురుషోత్తమ్, కొతవరపు జనార్దనరావు, అంగిరేకుల వెంకటేశ్వర్లు, రావూరి శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా పేరుతో ఉద్యమాన్ని అణచలేరు

పంగులూరు, జనవరి 9: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న సమ్మెను ఎస్మా పేరుతో అణచివేయలేరని సీఐటీయూ నేత మల్లారెడ్డి హెచ్చరించారు. పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా మంగళవారం నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీల శిబిరం వద్ద మల్లారెడ్డి మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్‌వాడీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సోమశిలలో 31.757 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 22 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 31.757 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.



బరిలో దిగుదాం..

ఊళ్లకు దూరంగా.. రోడ్లకు దగ్గరగా..

సంక్రాంతికి సై అంటున్న కోడిపుంజులు

పందెం కాద్దాం!

డైమండ్ డబ్బా, లోపలా బయటా, తదితర జూదాలు షురూ

ఎన్నికల ఏడాది కావడంతో నాయకుల అండ

ఆంధ్రజ్యోతి పరిశీలన





కాయ్ రాజా... కోడి రాజా..! అంటూ కోడిపందేలు, డైమండ్ డబ్బా, లోపలాబయటా, అచ్చుబొమ్మ, సింగిల్ నెంబర్లాట అబ్బో ఇలా ఎన్నో రకాల పందేలు నిర్వహించేందుకు జూదగాళ్లు సిద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన బరుల ఏర్పాటుకు ఊళ్లకు దగ్గరగా, రవాణాకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. సంక్రాంతికి నాలుగు రోజులు ముందే పందేలు ఆరంభించి పండుగ తర్వాత నాలుగు రోజులకు ముగించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా రాజకీయ నాయకులు పూర్తిస్థాయిలో అండగా నిలిచేందుకు అంగీకరించారని సమాచారం. ఇంకేముంది.. పోలీసులు, సెబ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా మౌఖిక ఆదేశాలు కూడా వెళ్లినట్టు తెలుస్తోంది.

నెల్లూరు (క్రైం), జనవరి 9 : సంక్రాంతి పండుగ అంటే చాలు పొరుగు జిల్లాలతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది జిల్లాకు వచ్చేందుకు ఉవ్విళ్లూరుతారు. ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడమే లేదా అప్పటికప్పుడు వాహనాలను అద్దెకు మాట్లాడుకుని జిల్లాలో వాలిపోతారు. అలా వచ్చే వారంతా అత్తగారి ఇంటికో లేదా బంధువుల ఇంటికో అని అనుకుంటే మీరు పొరబడ్డట్టే. పెద్ద పండుగ సందర్భంగా జిల్లాలో జరిగే వివిధ రకాల పందేలు ఆడేందుకు పెద్ద సంఖ్యలో జూదగాళ్లు ప్రతి ఏడాది తరలి వస్తుంటారు. అయితే, ఈ ఏడాది మాత్రం ప్రతిసారిలా కాకుండా వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండనుంది. ఎందుకంటారా!? త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో నాయకుల పూర్తి అండ నిర్వాహకులకు ఉండనుంది. ఇంకేం అడ్డూ అదుపు లేకుండా రాత్రింబవళ్లు జూదం నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

● నాయకుల అండతో...

మరోవైపు పండుగ సీజనులో జరిగే జూదాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతుంది. పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించి జూదాలు నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తుంటారు. కానీ ఆచరణలో ఇవేమీ ఉండటం లేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో జూదాలు జరుగుతున్నా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుంటారు. ఈసారి ఎన్నికల సంవత్సరం కావడంతో ఇప్పటికే పలువురు నాయకులను జూదం నిర్వాహకులు కలవడం, వారు కూడా సరేనంటూ అభయం ఇచ్చినట్టు సమాచారం. ఇంకేముంది.. సహజంగా ఒక బరిలో నిర్వహించే వారు ఈ ఏడాది రెండు, మూడు బరులను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బరులలో కోడి పందేలతో పాటు డైమండ్ డబ్బా, మూడుముక్కలాట, లోపలాబయట, ఇలా అనేక జూదాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. పందేలా కాసేందుకు, చూసేందుకు వచ్చే వారి కోసం టిఫిన్ స్టాల్స్, కూల్‌డ్రింక్స్, భోజనాలు, బిర్యానీ, ఇలా అనేక దుకాణాలు సైతం ఏర్పాటు చేసి వాటిని వేలం పాట ద్వారా అందజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. నాయకులు పూర్తి స్థాయిలో అందరికీ హామీలు ఇవ్వడం, ఇప్పటికే పోలీసులకు పందేల జోలికి వెళ్లొద్దని చెప్పినట్లు సమాచారం.

● జాతికోళ్ల కొనుగోలు

పెందేల కోసమే అన్నట్టుగా ఇతర రాష్ట్రాల నుంచి పందెపురాయుళ్ల జాతి కోళ్లను కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి డేగ, పొండుడేగ, పర్ల, నెమలి, బెరస ఇలా అనేక రకాల జాతి కోడిపుంజులను కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలలో రూ.3 వేలకు కొనుగోలు చేసిన పుంజును జిల్లాలో శిక్షణ ఇచ్చి రూ.10 వేల నుంచి లక్ష వరకు విక్రయిస్తున్నారు. శిక్షణ సమయంలో బాదం, జీడిపప్పు, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారం అందజేస్తుంటారు. నీటిలో ఈత, తాళ్లు కట్టి పరుగులు తీయించడం వంటి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాటుతేరిన కోళ్లను అధిక ఆదాయానికి అమ్మడం జిల్లాలో పలువురు వృత్తిగా మార్చుకున్నారు.



● ఇళ్లను అద్దెకు తీసుకుని..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు ఆడేందుకు ప్రకాశం, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాలో ఏయే ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారో ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఆ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలలోని లాడ్జీలలో గదులను ముందుగానే రిజర్వు చేసుకుంటున్నారు. ఒకవేళ గదులు దొరకని పక్షంలో తెలిసినవారి ద్వారా ఇళ్లను బాడుగకు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ సంక్రాంతికి రూ.లక్షలు గెలుచుకొని ఇళ్లకు పోవాలని కొందరు అప్పులు చేసి, ఆభరణాలు కుదవపెట్టి నగదు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ఎలాగైనా విస్తృతంగా పందేలు నిర్వహించి ఆదాయం సమకూర్చుకోవాలని నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నారు.

● కావలిలో తమిళ పుంజులు

కావలి : డివిజన్‌లోని మారుమూల ప్రాంతాలైన అడవులు, సముద్ర తీరప్రాంతాలు, మన్నేరు లాంటి వాగు పరిసర ప్రాంతాలను జూదరులు కోడి పందేలకు స్థావరాలుగా సిద్ధం చేసుకుంటున్నారు. రూ.10వేల నుంచి 50వేలకు పుంజులను కొనుగోలు చేసి పందేనికి సిద్ధం చేస్తున్నారు. సిద్ధం చేస్తున్నారు. కొంతమంది తమిళనాడులోని శీలం నుంచి కోడిపుంజులను ఇక్కడకు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. తీర ప్రాంత గ్రామాలైన చెన్నాయపాలెం, అన్నగారిపాలెం, తాళ్లపాలెం, కోటడవి, ఇస్కపల్లి తదితర తీర ప్రాంతాలలో ఉన్న అడవులలో పందేలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక అల్లూరు మండలంలో కోళ్ల పందేలు నిర్వహించే ముఠాలు 7 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. దగదర్తి, కలిగిరి మండలం దూబగుంట, అన్నలూరు, కావలి మండలం కొత్తపల్లి, పెద్దారం, చలంచర్ల తదితర అటవీ ప్రాంతాలలో కూడా కోడి పందేలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కొండాపురం మండలంలో పొట్టిపల్లి నుంచి వెల్లటూరువారి పాలెం వరకు మన్నేరు వాగు పరిసరాలలో పందేలు జోరుగా సాగే అవకాశాలు ఉన్నాయి. కొన్నిచోట్ల పోలీస్‌లతో ముందుగా మాట్లాడుకుని పందాలు వేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

● పట్టించుకునే వారేరీ!?

ఉదయగిరిరూరల్ : గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా వరికుంటపాడు మండలం జీ.కొండారెడ్డిపల్లి, కాంచెరువు, వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, ఉదయగిరి మండలం గుడినరవ, మల్లారెడ్డిపల్లి, మాసాయిపేట గ్రామాలతోపాటు సీతారామపురం, దుత్తలూరు మండలాల్లోనూ కోడి పందేలు జరుగుతున్నాయి. ఏటా నిర్వాహకులు జోరుగా పందేలను కొనసాగిస్తూ జేబులు నింపుకుంటున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉండే వలసవాసులు సైతం స్వగ్రామాలకు చేరుకోవడంతో పందేల నిర్వహణకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది.

● ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు సమాచారం. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో బరులు సిద్ధం చేసుకున్నారు. పందెపు రాయుళ్లకు, వీక్షకులకు ఎటువంటి లోటు రానీయకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టారు. అలాగే అక్కడ దుకాణాల ఏర్పాటుకు కూడా వేలం నిర్వహించినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ మరో ఐదు రోజులు ఉండగానే గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే పందేలు జరుగుతున్నాయి.



చల్ది కుండలతో తరలి వస్తున్న భక్తులు

దండాలు.. దండాలు.. అమ్మోరు తల్లో!

● అల్లూరులో వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

అల్లూరులో పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకంతో తిరునాళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ ప్రతిష్ఠ అనంతరం బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. మహిళలు చల్ది కుండలను తలపై పెట్టుకొని ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరకుని ప్రదక్షిణలు అనంతరం పోతురాజుకు నైవేద్యంగా సమర్పించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మేడ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. సాయంత్రం చలిపిండి పానకాలు, కుంభం కార్యక్రమంలో గ్రామస్థులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. ఆచార సంప్రదాయం ప్రకారం కొమ్మలోళ్ల ద్వారా పోలేరమ్మ కథ, ముద్రగడ పావనం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, ఆచారం తప్పెట్లతో కోలాటాలు, గంగపెట్టి, వీరతాళ్లు, ఆచార పలకలు, బొల్లి ఆవు, బసవదేవుడు, అరుంధతీయుల కత్తి ఆచారం, రజకుల కాగడాల వెలుగులు, నాయీ బ్రాహ్మణ వాయిద్యాలు, సినీ గాయకుల పాట కచేరి భక్తులను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, పోలీసులు విస్తృత ఏర్పాటు చేశారు.

- అల్లూరు



పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జాదారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఆ భూమి ప్రజావసరాలకు ఉపయోగపడుతుందన్న ఆలోచన లేదు.. అధికారమే అండగా కాజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇటువంటి వ్యవహారాలు అనేకం వెలుగు చూశాయి. తాజాగా నెల్లూరు నగర పరిధిలోని అంబాపురంలో కూడా 84 సెంట్ల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి, విక్రయానికి సిద్ధమయ్యారు.

దర్జాగా కబ్జా!

● అంబాపురంలో రూ.2కోట్ల భూమి అన్యాక్రాంతం

● అంకణాల చొప్పున విక్రయించేందుకు ప్రయత్నాలు

● 'స్పందన'లో ఫిర్యాదు చేసిన స్థానికులు

● రాజకీయ ఒత్తిళ్లతో అడ్డుకోని అధికార యంత్రాంగం

నెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అంబాపురంలోని సర్వే నెం.96లో 84 సెంట్ల బండిదారి పోరంబోకు భూమి ఉంది. పూర్వం ఈ భూమి గ్రామస్థుల రాకపోకలకు ఉపయోగపడేది. ఇందులో కొంత రోడ్డు వేయగా మిగిలిన భూమి ఖాళీగా ఉంది. ఊరి మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమిపై కొందరి అక్రమార్కుల కన్ను పడింది. అందులో ఒకరు వైసీపీ నాయకుడు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొంత స్థలంలో నిర్మాణాలు చేపట్టగా, మిగిలిన భూమి చుట్టూ ఫెన్సింగ్ నాటారు. ఈ ఆక్రమణపై స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో స్పందన పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని గతేడాది సెప్టెంబరులో రూరల్ మండల రెవెన్యూ అధికారులు ఈ ఫిర్యాదుకు సమాధానం ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● అంకణాల చొప్పున విక్రయం

ఇప్పుడు ఈ భూమిని అంకణాల చొప్పున విక్రయించేందుకు బేరం పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అంకణం రూ.40 వేల నుంచి 50 వేల వరకు చెబుతున్నట్లు చెప్పుకుంటున్నారు. సుమారు రూ.2 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కులు అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ ఈ ప్రాంతంలో అవసరాలు కూడా పెరుగుతున్నాయి. భవిష్యత్‌లో ఏదైనా పాఠశాల లేదా ఆసుపత్రి, కమ్యూనిటీ హాలో నిర్మించుకునేందుకు ఈ బండి దారి పోరంబోకు చాలా అనువుగా ఉంటుంది. అటువంటి భూమి పరుల పాలవుతున్నా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

హద్దు రాళ్లు నాటుతాం

అంబాపురంలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తాం. సర్వే చేసి ప్రభుత్వ భూమికి హద్దు రాళ్లు నాటుతాం. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

- సోమ్లా నాయక్, నెల్లూరు రూరల్ తహసీల్దార్



అంబాపురంలోని బండిదారి పోరంబోకు భూమిలో వేసిన ఫెన్సింగ్



వీఆర్సీ కూడలిలో బైఠాయించిన ఆందోళనకారులు

మద్దతుగా నిలిచి.. పోలీసులను ప్రతిఘటించి

వామపక్షాలు, ప్రజాసంఘాల ప్రదర్శన

వీఆర్సీ కూడలిలో రాస్తారోకో.. అడ్డుకున్న పోలీసులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్

నెల్లూరు (వైద్యం) జనవరి 9 : డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాలు మంగళవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ వరకు కొనసాగిన ప్రదర్శనలో వామపక్షాలతో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీఆర్సీ కూడలిలో రాస్తారోకో చేపట్టి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మొండి వైఖరి విడనాడాలంటూ నినాదాలు చేశారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి వాహనాలలో ఎక్కిస్తుండగా కార్యకర్తలు ప్రతిఘటించి పోలీసు వాహనాలను కదలనీయకుండా అడ్డుగా కూర్చొన్నారు. దీంతో చేసేదిలేక నాయకులను విడిచిపెట్టారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అంగన్‌వాడీల దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి మారాలన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహా, రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, హర్ష, రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మూలివెంగయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : 29 ఆకారంలో కూర్చొని ఉన్న అంగన్‌వాడీలు

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



ఆత్మకూరు : సంతకం చేస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జనవరి 9 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో కే మధులత అధ్యక్షతన జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వ రరావు, ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేష య్య, వైసీపీ నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు మరువలేనివని వెంగళరావు నగర్ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు అ మర్‌నాథ్‌రెడ్డి, హీనాలు పేర్కొన్నారు. మంగళవారం జన్ భాగ్యదారిలో భాగంగా సంతకాల సేకరణ చేపటారు. కార్యక్రమంలో సర్పంచి మొండ్రు తిరుప తయ్య, నాయకులు మహ్మద్‌ఖాజా, సిబ్బంది పాల్గొన్నారు.



కందుకూరు : కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టరు విద్యాధరి

సంగం : స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జన్‌భగీదారి కార్యక్రమంలో భా గంగా తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో గోపీ ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బిట్రగుంట : అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్నఅధికారులు

సీతారామపురం : జన్ భగీధారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మార్వో సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌వలి,ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : అంబేడ్కర్ భావజాలం ఆదర్శనీయం, ఆచరణీయమని స బ్ కలెక్టరు విద్యాధరి అన్నారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన అంబేడ్కర్ సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జన్ భగీదారీ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సబ్ కలెక్టరు కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం, ఈనెల 12న అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళాకారులు, విద్యార్థులు అంబేడ్కర్ జీవితచరిత్రపై సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పద్మజ, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఎంపీడీవో విజయశేఖర్, ముప్పవరపు కిషోర్, వీవీ శేషయ్య, ఇనకొల్లు మస్తానయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : మండలంలో సామాజిక న్యాయం పాటిస్తామని బోగోలు తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావులు అన్నారు. బోగోలు కూడల్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళ వారం సామాజిక సమత సంకల్పంలో భాగంగా రెండవ రోజు సంతకాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ఆత్మకూరు, జనవరి 9 : సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ, ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ నాయకులు తేల్చి చెప్పారు. మంగళవారం వారు తమ విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో చర్చించారు. సమ్మెను విరమించి విధుల్లో చేరాలని కోరారు. యూనియన్ నాయకులు నిరాకరించారు. కార్యక్రమంలో సీపీఎం నేత కే డేవిడ్‌రాజు, ఏఐటీయూసీ, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు బీ హజరత్తయ్య, జంగం నాగరాజు, ఎం చెంచయ్య, పీ కృష్ణయ్య, కే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : తమ సమస్యలు పరిష్కరించాలని ఏడు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దుర్మార్గమని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా కందుకూరు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. సాయంత్రం దీక్షల ముగింపు సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్మికసంఘాల నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, శేషమ్మ, కొండమ్మ, ఏఐటీయూసీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, మురళి, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, పవన్ పాల్గొన్నారు.



కావలి టౌన్ : ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్ : ప్రభుత్వానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టడం లేదని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అ ధ్యక్షుడు మల్లి అంకయ్య పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికు లు మంగళవారం శిబిరం వద్ద విప్లవ గీతాలతో కోలాటం వేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేత నాగరాజు, యూనియన్ నాయకులు ఆదినారాయణ, వెంకటేష్, రవి, రాజేష్, లక్ష్మమ్మ, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో అనుబంధ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజు కొనసాగింది. కార్యక్రమంలో యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, వో రమేష్, రాజ్యలక్ష్మి, చిన్నమ్మ, రాజేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

చవిటివాగులో ఆక్రమణల పరిశీలన



చవిటి వాగు ఆక్రమణపై రైతులతో మాట్లాడుతున్న ఏఈ కృష్ణ

సంగం, జనవరి 9: మండలంలోని తలుపూరుపాడు పొలాల్లో ఉన్న చవిటివాగు ఆక్రమణలను ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ఓ రైతు వాగుకు ఇసుక బస్తాలతో అడ్డు కట్ట వేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని, దీంతో ఎగువ పొలాలు ముంపునకు గురవుతున్నాయని స్పందనలో కొందరు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో ఏఈ చవిటి వాగును పరిశీలించారు. ఆక్రమణదారులను పిలిచి మందలించారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉదయగిరి రూరల్, జనవరి 9: మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ మంగళవారం తెలిపారు. 10న గండిపాళెం, 11న వెంగళరావునగర్, తిరుమలాపురం, 12న అప్పసముద్రం, దాసరిపల్లి, 13న ఉదయగిరి, కొండాయపాళెం, 14న గన్నేపల్లి, సేలటూరు, 16న అర్లపడియ, కృష్ణంపల్లి, 17న జీ.చెర్లోపల్లి, చెరువుపల్లి, 18న బండగానిపల్లి, అయ్యవారిపల్లి, 19న పుల్లాయపల్లి, శకునాలపల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

నిధులు మంజూరైనా సాగని పనులు



మర్రిపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే దారి

మర్రిపాడు, జనవరి 9 : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులను పక్కన ఉంచుకొని, గ్రామాల్లో సమస్యలను గుర్తించారు. ప్రధానంగా మురుగు కాలువల నిర్వహణ, సిమెంట్ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే ప్రభుత్వం ప్రతి సచివాలయానికి మొదటి విడతగా రూ. 20లక్షలు, రెండవ విడతగా మరో రూ. 20లక్షలు కలిపి రూ. 40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. మండలంలో మొత్తం 17సచివాలయాల పరిధిలో మొదట విడత నిధుల పనులు పూర్తి అయ్యాయి. కానీ మర్రిపాడుతోపాటు ఇర్లపాడు, భీమవరం, చాబోలు, ఎమ్మెల్యే స్వంత గ్రామం బ్రాహ్మణపల్లిలో ఇంతవరకు మొదటి విడత పనులు ప్రారంభం కాలేదు. ఇందుకు ప్రధాన కారణం సర్పంచుకు, నాయకులకు మధ్య సమన్వయ లోపమే. రెండవ విడతలో మరో రూ. 20లక్షలు మంజూరు కాగా మండలంలో ఒక్కచోట కూడా పనులు ప్రారంభించలేదు. కలెక్టరు నెలకు మూడు, నాలుగుసార్లు మండల అధికారులతో సమావేశాలు నిర్వహించినా ఉపయోగం లేకుండా పోయింది.

12 నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు

వలేటివారిపాలెం : మండలంలోని పోలినేనిపాలెంలో సంక్రాంతి సందర్భంగా అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు 10వ వార్డు సభ్యుడు ఎండ్లూరి అంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే టీంలు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. గెలుపొందిన టీంలకు మొదటి బహుమతి రూ.15 వేలు, 2వ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఊళ్లన్నావ్.. ఇళ్లే లేవు జగన్ ! : బొల్లినేని



పేదల గుడిసెను చూపుతున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 9: తమ ప్రభుత్వం ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తున్నదంటూ ప్రగల్బాలు పలికే సీఎం జగన్‌రెడ్డి ఒక్కసారి పేదల గుడిసెల వైపు చూడాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్‌తో కలిసి పట్టణంలోని స్టేట్‌పేట, బీసీ, ఎస్టీ కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు ఆనందరావు కుమారులు శ్రావణ్‌కుమార్, జాన్సన్ తమ అనుచరులతో టీడీపీలో చేరగా, వారికి బొల్లినేని కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, సజిల్ మాబాషా, ఖాన్‌సా, అబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించండి



కేక్ కట్ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి, జనవరి 9: ఉదయగిరి అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి నివాసంలో మండల వైసీపీ నాయకులతో సమీక్షించారు. ఈనెల 12న ఉదయగిరిలో జరిగే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బహిరంగసభ విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. జనగన్న ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ నాయకుడు ఎంఏ రియాజ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జీ.ఓబులరెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసులు, గడియాల్పీ ఎస్థానీ, పెంచలయ్య, యస్థాన్, హరి, అక్కి భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచి ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, జనవరి 9 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి ఇంగ్లీష మీడియం హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు పట్టుపంచెలు, విద్యార్థినులు పట్టు లంగాలు ధరించడంతో నూతన శోభ సంతరించుకుంది. హరిదాసులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు వంటివి ఏర్పాటు చేశారు. చిన్నారులు హరిదాసుల వేషాలు, సంక్రాంతి పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక వికాస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రంగవల్లు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఖాదర్‌వలి, హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న పరికరాలు



నిరుపయోగంగా ఉన్న పరికరాలు

వరికుంటపాడు, జనవరి 9: దోమల నివారణ కోసం వినియోగించాల్సిన పరికరాలు స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఇలానే ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎంతో విలువైన ఆ పరికరాలను కనీసం అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది. దీంతో అవి వినియోగానికి నోచుకోకుండానే తుప్పుపట్టి నాశనమవుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు వృథాగా పడిఉన్న పరికరాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పింఛన్ల పంపిణీ

దగదర్తి(బిట్రగుంట): దగదర్తి మండలంలోని దగదర్తి, తడకలూరు గ్రామాల్లో ఎంపీడీవో శీనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు పాల్గొని లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. సర్పంచులు శీనయ్య, గిరినాయుడు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం..



ఉదయగిరి సీడీపీవో కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కావలిలో 29 అంకె ఆకారంలో అంగన్‌వాడీలు

ఉదయగిరి, జనవరి 9: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఉదయగిరి సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు మోకాళ్లపై నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదని అంగన్‌వాడీలు మంగళవారం కూడా సమ్మె కొనసాగించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వారికి మద్దతును ప్రకటించాయి. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీ శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

కందుకూరు : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. జీతాలు పెంచేవరకు విధులకు హాజరయ్యేది లేదన్నారు. అంగన్వాడీలు సమ్మె 29వ రోజుకు చేరిన సందర్భంగా 29 అంకెతో కూర్చుని చుట్టూ మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు, బోసుబాబులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం నియంతపోకడకు నిదర్శనమని, వారితో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, రహంతున్నీషా, సరస్వతి, ప్రభావతి, రాధ, కేశవకుమారి, సీఐటీయూ నాయకులు డి. రామమూర్తి, ఎస్‌ఏ గౌస్, ఎస్. పవన్‌కుమార్, టి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు చేరిన సమ్మె

కావలిటౌన్ : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరింది. సమ్మె 29 రోజులు పూర్తి చేసుకున్న క్రమంలో 29 అంకె ఆకారంలో అంగన్వాడీలు కూర్చుని నిరసన తెలిపారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, వజ్రమ్మ, విజయలత, సుభాషిణిలు మాట్లాడుతూ తమ సమ్మె పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా వ్యవహరించకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తానని జగన్ మాట ఇవ్వడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాట తప్పని మడప తిప్పని వంశమని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పారని ఆరోపించారు. ఎస్మాకు భయపడే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కృష్ణమోహన్, తాళ్లూరు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అనుసరించడమంటే

సంక్షేమ పథకాలు ఎత్తి వేయడమా?

● రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కావలి, జనవరి 9: దళిత, గిరిజనుల సంక్షేమ పథకాలను ఎత్తి వేసిన జగన్ ప్రభుత్వం అంబేడ్కర్‌ను అనుసరిస్తున్నామని చెప్పుకోవడం బాధాకరమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం కావలి ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. వాటి కోసం కేంద్రం ఇచ్చిన రూ.4,500 కోట్ల నిధులను ఇతర పథకాలకు మళ్లించుకున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత, గిరిజనులను ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో 260 మంది దళితులను ఊచకోత కోయడం, 863 మంది దళిత, గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం జగనన్న పాలనలో జరిగిందన్నారు. ఎన్నికలు వస్తుండటంతో దళిత, గిరిజనులను మోసం చేయడానికి అంబేడ్కర్ పేరు మీద వారోత్సవాలు నిర్వహించడం మోసపూరితమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ముక్కు మోహన్‌రావు, ఆలూరు బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, జడ్డా వాసు, జీ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలి

కావలి, జనవరి 9: ప్రధానమంత్రి ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకుని తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మేఘనాథచౌదరి తెలిపారు. ప్రధానమంత్రి ఆరోగ్య సురక్ష పథకం కింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కరోనా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



బాలింతలకు మందులు అందచేస్తున్న డాక్టర్ మేఘనాథ చౌదరి

కాలువ పనుల వివరాలు మీకెందుకు చెప్పాలి

● సమాధానం చెప్పేందుకు ఏఈ నిరాకరణ ● అధికారి తీరుపై జనసేన నాయకుల ఆగ్రహం



పూడికతీత పనులు వద్ద జనసేన నాయకులు

కలిగిరి, జనవరి 9: సోమశిల ఉత్తర కాలువకు అనుసంధానంగా ఉన్న శ్రీకొలను బ్రాంచి కాలువ పూడికతీత పనులకు సంబంధించి వివరాలు అడిగితే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, వివరాలు ఇవ్వనవసరం లేదని సోమశిల ఉత్తర కాలువ ఏఈ క్రిష్ణయ్య సమాధానం చెప్పారని జనసేన నాయకులు మండిపడ్డారు. మంగళవారం పూడికతీత పనులు జరుగుతున్న ప్రదేశానికి స్థానిక రైతులతోపాటు జనసేన నాయకులు వెళ్లి పనులకు సంబంధించి పూర్తి వివరాలు, పనులు చేస్తున్న కాంట్రాక్టరు వివరాలు అడిగితే సమాధానం చెప్పనవసరం లేదని వ్యంగంగా మాట్లాడటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జనసేన మండల కన్వీనర్ బీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఏటా లక్షలాది రూపాయలతో కాలువ పూడికతీత పనులకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయించుకొని ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం జరుగుతుంటే ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కావలిటౌన్, జనవరి 9: యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం పట్టణంలోని దొడ్ల మనోహర్ నారాయణ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్‌కిరణ్, ఆచారపు పెద్దింటి యాదవ్ సమాది వెంకటకృష్ణ, బీజేపీ నాయకులు బ్రహ్మానందం, మాజీ కౌన్సిలర్ సన్నిబోయిన నారాయణ తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన సూర్యనారాయణ, సన్నిబోయిన నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎపా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బూచి మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేక మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గొబ్బెళ్ల కృష్ణయ్య, రమణయ్య, వంటేరు మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వలేటివారిపాలెం, జనవరి 9 : మండలంలోని చుండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అయ్యవారిపల్లె, చుండి, రామలింగాపురం, పోలినేనిచెరువు, కాకర్లవారిపాలెం, మాలకొండ, గరుకుపాలెం, గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నందున వాటిని పక్కకు మార్చే క్రమంలో విద్యుత్ సరపరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. పనుల అనంతరం వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ 9 గంటలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ మధుబాబు కోరారు.

131 పింఛన్ల మంజూరు

లింగసముద్రం, జనవరి 9 : మండలానికి కొత్తగా 131 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో యు శేషబాబు మంగళవారం చెప్పారు. కొత్తగా పింఛన్ మంజూరైన వారికి నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవర్లకు నష్టం కలిగించే జీవో రద్దు చేయాలి

● ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన



కందుకూరు డిపో గ్యారేజీ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, డ్రైవర్లు

కందుకూరు, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లకు తీరని నష్టం చేసే ప్రమాదకరమైన జీఓను విడుదల చేసిందని, ఈ జీఓను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద నిరసన కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగితే విచారణ కూడా లేకుండా డ్రైవర్లకు శిక్ష విధించేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, ఇది కేవలం ఆర్టీసీ డ్రైవర్లకే కాదు ప్రతి ఒక్కరికీ ప్రమాదకరమేనని పేర్కొన్నారు. ఎలాంటి ముసాయిదా లేకుండా ముందస్తు చర్చలు లేకుండా ఈ జీఓను తేవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఏఎస్ రావు, ఎస్కే రబ్బాని, కేఎస్ రావు, వేమూరి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ నాయకులు మాధవ్, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం : ఎమ్మెల్యే

కావలి రూరల్, జనవరి 9: పేదరిక నిర్మూలనే సీఎం జగనోమహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నెలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాల దిన్నె, మన్నంగిదిన్నె, సర్వాయపాలెం, తాళ్లపాలెం సర్పంచులు ఊడా బ్రహ్మానందం, చలంచర్ల ప్రభాకర్ రెడ్డి, యానాది, కటికాల సురేష్, జట్పీటీసీ జంపాని రాఘవులు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, ఏఎంసీ చెర్మన్ సన్నిబోయిన ప్రసాద్, సచివాలయ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్

కావలి, జనవరి 9: నిరుద్యోగులకు కాంపిటేటీవ్ ఎగ్జామ్స్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను తన ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందచేస్తానని డాక్టర్ కాకాని మాల్రాది తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ తిరుపతి వారి ఆధ్వర్యంలో కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో ఫైనాన్స్ ఆఫ్ వీకర్స్ సెక్షన్‌పై జరిపిన పరిశోధనలో డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. దీంతో తనకు బాధ్యత పెరిగి మరింత సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. 15 సంవత్సరాలుగా పినాకినీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నిరుద్యోగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధి కల్పించానన్నారు.

కోటయ్య మందిరం సమీపంలో జోరుగా మద్యం విక్రయాలు

లింగసముద్రం, జనవరి 9 : లింగసముద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రంగా భావిస్తున్న తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో కొందరు వ్యక్తులు అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ మందిరం పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తిమ్మారెడ్డిపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చిల్లచెట్లలో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు మద్యం విక్రయాలు సాగిస్తూ ఒక్కో సీసాపై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు అక్కడే మద్యం సేవించి మత్తులో తూలతుండడం, కొందరు ఫూటుగా తాగి రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్ద పడిపోతుండడంతో మందిరానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మందిరానికి కేవలం 100 అడుగుల దూరంలోనే మద్యం విక్రయాలు సాగిస్తువారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ట